


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 210, పేజీలు - 08 | మంగళవారం, జనవరి 13, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## ముంబయి వస్తా.. ఏం చేస్తావో చూస్తా

- రాజ్ ఠాక్రేకు అన్నామలై సవాల్



చెన్నై (ప్రశ్న న్యూస్) మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ థకరేపై తమిళనాడు బీజేపీ నేత కే. అన్నామలై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, థకరేల బెదిరింపులు తనను ముంబై రాకుండా అడ్డుకోలేవని స్పష్టం చేశారు. ఇటీవల ముంబైలో శివసేన-ఎంఎన్ఎస్ ర్యాలీలో అన్నామలైని హేళన చేస్తూ, "తమిళనాడు నుంచి ఒక రసమలై వచ్చాడు, ఇక్కడికి నీకు సంబంధం ఏమిటి? హటావో లుంగీ బజావో పుంగీ" అని రాజ్ థకరే వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై అన్నామలై స్పందిస్తూ "నన్ను బెదిరించడానికి ఆదిత్య థకరే, రాజ్ థకరే ఎవరు?" అని ప్రశ్నించారు. రైతు కొడుకుగా ఉన్నందుకు గర్విస్తున్నానని, రాజకీయ బెదిరింపులకు భయపడనని

2లో..

## రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో
# జిల్లాల పునర్విభజన కమిటీ

- సీఎం రేవంత్ సంచలన ప్రకటన



- ఇప్పటి వరకు తాను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదన్న ముఖ్యమంత్రి
- ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరన్న రేవంత్ రెడ్డి
- ఉద్యోగులే ప్రభుత్వ సారథులు.. వారధులన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జిల్లాల పునర్వ్యవస్థీకరణపై రిటైర్డ్ జడ్జి, విశ్రాంత అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కనీసం ఆరు నెలల్లోగా రిపోర్ట్ ఇవ్వాలని కోరుతామని వాటి ఆధారంగానే మరోసారి జిల్లాలను శాస్త్రీయ విభజన చేస్తామన్నారు. గతంలో అశాస్త్రీయంగా జిల్లాల విభజన జరిగిందన్నారు. ఐదు మండలలాలో ఓ జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. సికింద్రాబాద్ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేసిందెక్కడ తీసేసిందెక్కడ అని రేవంత్ ప్రశ్నించారు. సికింద్రాబాద్ గ్రేటర్ లో భాగంగానే ఉందని గుర్తు చేశారు. రాచరికాన్ని పోలి ఉందని ఒక్క రాచకొండను మాత్రమే మార్చామన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ క్యాలెండర్ ను ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. గత ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం, కేవలం ఐదు మండలాలను కలిపి కూడా కొన్ని జిల్లాలను ఏర్పాటు చేసిందని, దీనివల్ల పాలనలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ప్రజల సౌలభ్యం, భౌగోళిక పరిస్థితుల ఆధారంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ మరోసారి జరగాల్సిన అవసరం ఉందని

2లో..

## స్టైల్ అదిరింది..
# గాలిపటం ఎగిరింది

- సంక్రాంతి సంబరాల్లో ప్రధాని మోదీ




అహ్మదాబాద్ (ప్రశ్న న్యూస్) సంక్రాంతి సంబరాలు జోరుగా జరుగుతున్నాయి. పల్లెటూరులన్నీ కళకళలాడుతున్నాయి. ఎటు చూసినా కోలాహలమే. సంక్రాంతి సమయంలో గాలి పటాలది ప్రత్యేకమైన స్థానం. చిన్నా పెద్దా అంతా చేపి పోటీ పడి మరి పతంగులు ఎగురవేస్తాం. దీనికి దేశ ప్రధాని మోదీ కూడా మినహాఇంపు కాదు. ఆయన కూడా ఈ సారి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. అంతే కాదు సరదాగా గాలి పటం కూడా ఎగరేశారు. ప్రధాని రేంజ్ కు చిన్న గాలిపటం ఎగురవేస్తే ఏం బాగుంటుంది అందుకే ఆయన స్టైల్లో ఆయనే రంగంలోకి దిగారు. అహ్మదాబాద్‌లోని సబర్మతి రివర్‌ఫ్రంట్ వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్-2026లో ఓ అరుదైన దృశ్యం దేశవ్యాప్తంగా ఆకర్షణగా మారింది. భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్ కలిసి గాలిపటం ఎగరేశారు. ప్రత్యేకంగా భగవాన్ హనుమంతుడి చిత్రంతో రూపొందించిన గాలిపటం ఆకాశంలోకి ఎగరడం

2లో..

## తెలంగాణ పిటిషన్
# ఉపసంహారణ

- సర్కారుకు షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు

- పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీం తీర్పు
- తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ విచారణకు అర్హత లేదన్న సుప్రీం
- పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ ప్రభుత్వం



హైదరాబాద్/ న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పోలవరం- నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు వివాదంపై సుప్రీం కోర్టులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రిట్ పిటిషన్‌కు బదులుగా సివిల్ సూట్ రూపంలో మళ్లీ దాఖలు చేయాలని సీజేఐ సూచించడంతో తెలంగాణ సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ అనుమతులు లేకుండానే నీటిని అధికంగా వాడుకుంటోందని

2లో..

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు జాతీయహోదా సాధ్యం కాదు

- కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) వీబి-జీ రామ్ జీ యాక్ట్-2025 పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ చట్టం కేవలం గుంతలు తవ్వే పథకం కాదని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి కుటుంబానికి అదనపు ఆదాయం కల్పించేలా రూపొందించబడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకంలో టెక్నాలజీని జోడించడం ద్వారా జవాబుదారీతనాన్ని పెంచామని, గతంలో ఉన్న అవినీతిని అరికట్టేందుకు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు జమ చేసేలా డిజిటల్ విధానాన్ని పటిష్టం చేశామని తెలిపారు. సంస్కరణలు

2లో..

# పుష్కరాల లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి

- సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సమీక్ష

- తెలంగాణ ప్రాజెక్టులు కట్టినప్పుడు తాను వ్యతిరేకించలేదని వెల్లడి
- పోలవరం ప్రాజెక్టులో మిగిలిన నీటిని తెలంగాణ వినియోగించుకోవచ్చు
- నల్లమలసాగర్ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్న చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) భారతదేశానికి వచ్చే విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కనుక రాష్ట్రానికి ఇక తిరుగుండదని, పుష్కరాలలోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తమైన వ్యవస్థలను గాడిలో పెట్టి, సుపరిపాలన అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2025 సంవత్సరం రాష్ట్రానికి సానుకూల ఫలితాలను ఇచ్చిందని, ప్రజల్లో మళ్ళీ ఆశలు, విశ్వాసాన్ని నింపగలిగామని సంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం అప్పు తీసుకునే వెసులుబాటు కూడా లేని దుస్థితి నుంచి,

2లో..

## ఇది చంద్రబాబుకు
# రేవంత్ రెడ్డి ఇచ్చిన సంక్రాంతి గిఫ్ట్

- సుప్రీంలో బలహీనమైన పిటిషన్ వేసి ఏపీకి సహకరిస్తున్నారన్న హరీశ్
- గురుదక్షిణ కోసమే తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆక్షేపణ
- రేవంత్ రెడ్డి తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరిక



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తీరును హరీష్ రావు మరోసారి తీవ్రంగా తప్పు పట్టారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అనుసరిస్తున్న తీరు తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. విచారణకు అర్హత లేని రిట్ పిటిషన్ దాఖలు చేయడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఏపీకి అనుకూలంగా వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. ఒకవైపు ఏపీ ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తుంటే,

2లో..

## యువత దుర్భర పరిస్థితులు
# చూస్తుంటే బాధగా ఉంది

- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన జగన్



అమరావతి (ప్రశ్న న్యూస్) జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. స్వామి వివేకానంద ఆలోచనలను ఆయన ప్రస్తావిస్తూ యువత ఏకాగ్రత, లక్ష్యంతో కృషి చేస్తే దేశం బలపడుతుందని వివేకానంద నమ్మారని వివరించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో యువత మాత్రం ఆ ఆశయానికి భిన్నంగా ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్లు చెల్లించలేదని, రూ.4,900 కోట్ల విద్యా దీవెన, రూ.2,200 కోట్ల వసతి దీవెన బకాయిలు పేరుకుపోయాయని జగన్ విమర్శించారు. మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి కూడా రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆన్‌లైన్ సర్టిఫికేషన్

2లో..

## వాహనాల చలాన్లకు
# డిస్కౌంట్ ఇవ్వొద్దు

- వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే బ్యాంకు ఖాతాను లింక్ చేయాలని సూచన
- మైనర్లకు ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులపై కేసు పెట్టాలన్న ముఖ్యమంత్రి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వాహనాలకు చలాన్లు విధిస్తున్నప్పటికీ, డిస్కౌంట్ ఇచ్చి తగ్గిస్తారనే భావన ఒక పెద్ద సమస్యగా మారిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇకపై ట్రాఫిక్ చలాన్లకు ఎలాంటి డిస్కౌంట్ ఇవ్వరాదని ఆయన సూచించారు. ఏ వాహనమైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే, యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ అయ్యే విధానం రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో యూసఫ్‌గూడ స్టేడియంలో

2లో..

# సుప్రీంకోర్టులో ఈడీ VS దీదీ

- రూ.2742 కోట్ల కుంభకోణం- ఐప్యాక్‌పై దాడుల కేసు
- సుప్రీంలో దీదీపై ఈడీ సంచలన ఆరోపణలు



కోల్కతా/ న్యూ ఢిల్లీ (ప్రశ్న న్యూస్) అసెంబ్లీ ఎన్నికలకు ముందు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రముఖ రాజకీయ వ్యూహకర్త సంస్థ ఐప్యాక్ కార్యాలయాలపై ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేపట్టిన దాడులు ఆపై టీఎంసీ అధినేత్రి, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడికి

2లో..

## దివ్యాంగుల జంట పెళ్లి చేసుకుంటే
# రెండు లక్షలు సహాయం

- సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విద్య, ఉద్యోగాల్లో దివ్యాంగులకు అవసరమైన రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా దివ్యాంగులు దివ్యాంగులను పెళ్లి చేసుకుంటే వారికి ఆర్థికంగా 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించాం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

2లో..

## ముంబయి వస్తా.. ఏం చేస్తావో చూస్తా

ఆయన అన్నారు. "నేను ముంబైకి వస్తే నా కాళ్లు నరికివేస్తామని కొందరు రాశారు. నేను ముంబైకి వస్తాను. నా కాళ్లు నరికివేయడానికి ప్రయత్నించండి. అలాంటి బెదిరింపులకు నేను భయపడి ఉంటే, నేను నా గ్రామంలోనే ఉండేవాడిని" అని అన్నామలై స్పష్టంగా చెప్పారు. తన వ్యాఖ్యలు మరాఠీల గొప్పతనాన్ని దెబ్బతీశాయని వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ, "కామరాజ్ భారతదేశంలో గొప్ప నాయకుడు అని చెబితే, ఆయన తమిళుడు కాకుండా పోతాడా? ముంబై ప్రపంచస్థాయి నగరమని చెబితే, మహారాష్ట్రీయులు దానిని అభివృద్ధి చేయలేదని అర్థమా?" అని ప్రశ్నించారు. ముంబై ప్రతిష్ఠ మరాఠీ ప్రజల సహకారం నుంచి విడదీయరానిదని ఆయన అన్నారు. తనను విమర్శిస్తున్నవారిని అజ్ఞానులు అని అన్నామలై సంబోధించారు. ధోవతులు, లుంగీలు వంటి వస్త్రధారణను హేళన చేయడాన్ని ప్రశ్నిస్తూ, తమిళులను తక్కువ చేసే శివసేన యూబీటీతో డీఎంకే పార్టీ పొత్తు ఉండటాన్ని విమర్శించారు.

## స్టైల్ అదిరింది.. గాలిపటం ఎగిరింది

ఈ కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. భారతీయ సంప్రదాయం, సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో ప్రతి ఏడాది నిర్వహించే అంతర్జాతీయ గాలిపటాల పండుగకు ఈసారి అంతర్జాతీయ ప్రాధాన్యం మరింత పెరిగింది. జర్మన్ ఛాన్సలర్ ఆహ్వానాన్ని స్వీకరించి ఈ కార్యక్రమానికి హాజరవడం ద్వారా భారత్–జర్మనీ మధ్య సాంస్కృతిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేసినట్టయింది. ప్రధాని మోదీ, ఛాన్సలర్ మెర్జ్ ఇద్దరూ కలిసి హనుమంతుడి ప్రతీకతో ఉన్న గాలిపటాన్ని ఎగరేసి, "సంస్కృతి, సంప్రదాయాలు దేశాల మధ్య స్నేహానికి వంతెనలు" అన్న సందేశాన్ని స్పష్టంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, గాలిపటాల పండుగ కేవలం వినోదం మాత్రమే కాదని, ఇది భారతదేశంలోని ఐక్యత, ఆనందం, ఆశలను ప్రతిబింబించే వేడుక అని అన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు, పర్యాటకులు ఈ వేడుకలో పాల్గొనడం భారత్ యొక్క సాఫ్ట్ పవర్‌ను ప్రతిఫలిస్తోందని పేర్కొన్నారు. హనుమంతుడి గాలిపటం శక్తి, ధైర్యం, భక్తికి ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్ కూడా ఈ అనుభవం తనకు ప్రత్యేకమని తెలిపారు. భారతీయ పండుగల్లో దాగి ఉన్న సాంస్కృతిక లోతు, ప్రజల ఉత్సాహం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. గాలిపటం ఎగరేయడం ద్వారా భారత సంప్రదాయంలో భాగమవడం గర్వంగా ఉందని చెప్పారు. సబర్మతి రివర్‌ఫ్రంట్ మొత్తం రంగురంగుల గాలిపటాలతో కళకళలాడింది. వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు తమ దేశాలకు చెందిన ప్రత్యేక డిజైన్లతో గాలిపటాలను ఎగరేశారు. అయితే ప్రధాని మోదీ–జర్మన్ ఛాన్సలర్ కలిసి ఎగరేసిన హనుమంతుడి గాలిపటం మాత్రం ఈ వేడుకకు హైలైట్‌గా నిలిచింది. ఈ దృశ్యం భారత్–జర్మనీ మధ్య పెరుగుతున్న స్నేహానికి, సాంస్కృతిక దౌత్యానికి ప్రతీకగా నిలిచిందని రాజకీయ, సాంస్కృతిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సంప్రదాయం, అంతర్జాతీయ స్నేహం కలిసిన ఈ ఘట్టం ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ 2026ను మరింత గుర్తుండిపోయేలా చేసింది.

## తెలంగాణ పిటిషన్ ఉపసంహరణ

ఆయన ఆరోపించారు. కాగా, ఈ ప్రాజెక్టుపై సివిల్ సూట్ రూపంలో తెలంగాణ పోరాటం కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. ఏపీలో నిర్మించ తలపెట్టిన పోలవరం– నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి సుప్రీంకోర్టులో ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. అయితే సోమవారం (జనవరి 12) అత్యున్నత ధర్మాసనంలో పిటిషన్ విచారణ సందర్భంగా అనూహ్యం పరిణామం చోటుచేసుకుంది. పోలవరం– నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అధికారికంగా వెల్లడించారు. పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకున్న నేపథ్యంలో కేసును డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా అత్యున్నత ధర్మాసనం పేర్కొంది.

### - ఎందుకు వెనక్కి తీసుకుంది.?

పోలవరం– నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. అయితే రిట్ పిటిషన్‌లా కాకుండా సివిల్ సూట్ రూపంలో మళ్లీ పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. అందుకే పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. దీంతో సివిల్ సూట్ రూపంలో మరోసారి తెలంగాణ ఈ అంశంపై పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి.

### - ఏపీ ఉల్లంఘనలకు పాల్పడుతోంది

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న ప్రాజెక్టుపై తాము అభ్యంతరాలతో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తెలంగాణ ప్రభుత్వం తరఫున బలంగా వాదనలు వినిపించామన్నారు. అయితే కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడుకోవద్దనేది ఇందులో ముఖ్యమైన అంశమని తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఏపీ అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడిందని ఆరోపించారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. వాటిని కూడా అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చామన్నారు. అంతేకాకుండా ఏపీ స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని కోర్టుకు నివేదించినట్లు వెల్లడించారు. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలేనని కానీ దానికి మించి ఉపయోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రయత్నాలు చేస్తోందన్నారు. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండానే ఏపీ సర్కార్ ప్రయత్నాలు మొదలుపెట్టిందని కోర్టుకు చెప్పినట్లు వెల్లడించారు.

### - ఏంటీ వివాదం?

ఏపీలో పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అయితే పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే లింక్ ప్రాజెక్టు నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. అందుకు తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. అందులో భాగంగానే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు లేవని, బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం విధానాలు ఉన్నాయని ఆ పిటిషన్‌లో ఆరోపించింది తెలంగాణ.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు జాతీయహెూదా సాధ్యం కాదు

అనేవి నిరంతర ప్రక్రియ అని, గత అనుభవాల దృష్ట్యా పేదలకు మరింత మేలు చేసేందుకే ఈ మార్పులు తెచ్చామని పేర్కొన్నారు. ఈ నూతన చట్టం ద్వారా కూలీలకు పక్కాగా హక్కులు కల్పిస్తున్నామని కిషన్ రెడ్డి వెల్లడించారు. పని అడిగిన 15 రోజుల్లోగా పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి చెల్లించాలని, అలాగే వేతనాలు ఆలస్యమైతే రోజుకు 5 శాతం చొప్పున జరిమానా విధించేలా కఠిన నిబంధనలు తెచ్చామని చెప్పారు. పథకం అమలులో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పనుల సీజన్‌లో ఈ పథకాన్ని ఎప్పుడు అమలు చేయాలో నిర్ణయించుకునే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించామని స్పష్టం చేశారు. పథకం పర్యవేక్షణ కోసం అడ్మినిస్ట్రేషన్ నిధులను 9 శాతానికి పెంచి, జియో–ట్యాగింగ్ ద్వారా పనుల్లో పారదర్శకతను పెంచుతున్నట్లు వివరించారు. నిధుల కేటాయింపు విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కిషన్ రెడ్డి కొట్టిపారేశారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా రూ. 17 వేల కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్రానికి కూడా గత ఏడాది కంటే సుమారు రూ. 340 కోట్లు అదనంగా నిధులు అందబోతున్నాయని గణాంకాలతో సహా వివరించారు. ఫెడరల్ స్ఫూర్తితో కేంద్రం––రాష్ట్రాలు భాగస్వాములుగా పనిచేస్తేనే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతాయని, రాష్ట్రాల అధికారాలను కేంద్రం లాక్కుంటోందన్న విమర్శల్లో వాస్తవం లేదని హితవు పలికారు. పథకాల పేర్ల మార్పు ముఖ్యం కాదని, అవి పేదలకు నిజంగా ఉపయోగపడుతున్నాయా లేదా అన్నదే కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ అంశాలపై స్పందిస్తూ.. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వం సుస్థిరమని, వరుసగా మూడోసారి అధికారంలోకి రావడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. పాలమూరు––రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా విషయంలో చట్టపరమైన పరిమితులు ఉన్నాయని, అయితే ఆ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా రాష్ట్ర విభజన చట్టం ప్రకారం దక్కిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

## యువత దుర్భర పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉంది

కోర్సులు నిలిపివేయడం వల్ల యువత నైపుణ్యాలు పెంచుకునే అవకాశాలు కూడా దూరమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ పాలనలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, చంద్రబాబు యువతకు వెన్నుపోటు పొడిచారని జగన్ విమర్శించారు. ఇకనైనా మేల్కొని యువతకు అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ పాలనలో యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, చంద్రబాబు యువతకు వెన్నుపోటు పొడిచారని జగన్ విమర్శించారు. ఇకనైనా మేల్కొని యువతకు అవసరమైన సహకారం అందించాలని ప్రభుత్వానికి సూచించారు.

## పుష్కరాల లోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి

సూపర్ సిక్స్ వంటి భారీ హామీల ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా పట్టాలెక్కించామని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పనిచేసి ప్రజల ఆశలను నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

### - సంక్షేమ పథకాల ఘన విజయాలు

ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన సహాయాన్ని సీఎం గణాంకాలతో వివరించారు. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 10,090 కోట్లు జమ చేయగా, 'స్త్రీశక్తి' ఉచిత ప్రయాణం కింద మహిళలు 3.5 కోట్ల సార్లు ప్రయాణించారు (రూ. 1,114 కోట్ల వ్యయం). అన్నదాత సుఖీభవ ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ. 6,310 కోట్లు, 'దీపం 2.0' కింద 2 కోట్ల గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఏడాదిన్నర కాలంలో రూ. 50 వేల కోట్ల సామాజిక పెన్షన్లను అందించి సంక్షేమంలో సరికొత్త మైలురాయిని అధిగమించినట్లు వెల్లడించారు.

### - పుష్కరాలలోపు పోలవరం ప్రాజెక్టు పూర్తి

పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ జీవనాడి అని, దీనిని వచ్చే పుష్కరాల లోపు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. సముద్రంలో వృథగా కలుస్తున్న 3 వేల టీఎంసీల గోదావరి నీటిని పోలవరం–నల్లమల సాగర్ లింక్ ద్వారా రాయలసీమ, ప్రకాశం ప్రాంతాలకు తరలించి ఆ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని, తెలంగాణ కూడా మిగిలిన నీటిని వాడుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వివాదాలు లేకుండా గోదావరి మిగులు జలాలను వినియోగించుకోవడంపై ఫోకస్ చేశామన్నారు. ఇటీవల ట్రయల్ రన్ విజయవంతమైన భోగాపురం ఎయిర్‌పోర్టును కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు చంద్రబాబు తెలిపారు.

### - పెట్టుబడులు, ఐటీ రంగం

ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడులలో 25 శాతం ఏపీకే రావడం విశేషమని చంద్రబాబు అన్నారు. విశాఖపట్నంలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని, అమరావతిలో 'క్వాంటం వ్యాలీ'కి త్వరలో పునాది వేస్తామని వెల్లడించారు. విశాఖ ఉక్కును రూ. 12 వేల కోట్ల కేంద్ర సాయంతో కాపాడుకుంటామని, సీఐఐ, ఎస్ఐపీబీ ఒప్పందాల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్ కు రూ. 1.19 కు తగ్గించడమే భవిష్యత్ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం తరహాలో రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పెంచలేదన్నారు.

## ఇది చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ఇచ్చిన సంక్రాంతి గిఫ్ట్

ఇక్కడ చేతగానితనాన్ని ప్రదర్శిస్తూ తెలంగాణకు ఈ ప్రభుత్వం చారిత్రక ద్రోహం చేస్తోందని, సుప్రీంకోర్టు సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలు స్వరూపం బయటపడిందని ఆయన మండిపడ్డారు. ఢిల్లీలో న్యాయవాదులు, మంత్రులు ఉన్నప్పటికీ ఇంత బలహీనమైన పిటిషన్ వేయడం వెనుక రహస్య ఒప్పందాలు ఉన్నాయని హరీశ్ రావు అనుమానం వ్యక్తం చేశారు. రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకుని సివిల్ సూట్ వేస్తామని ప్రభుత్వం చెప్పడం అంటే, ఏపీకి ప్రాజెక్టు పూర్తి చేసుకోవడానికి గడువు ఇవ్వడమేనని ఆయన విమర్శించారు. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలను ఈ వివాదంలోకి లాగడం వల్ల విచారణ ఏళ్ల తరబడి సాగుతుందని, ఈలోగా ఏపీ ప్రభుత్వం పనులు పూర్తి చేసి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే మన ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబు నాయుడికి సంక్రాంతి కానుకగా ఈ ప్రాజెక్టును అప్పగిస్తున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. గతంలో బనకచర్ల విషయంలో అభ్యంతరాలు లేవంటూ సంతకం పెట్టినప్పుడే ఈ జల దోపిడీకి పునాది పడిందని, ఇప్పుడు న్యాయస్థానంలో పస లేని వాదనలు వినిపిస్తూ తెలంగాణ నదీ జలాలకు మరణశాసనం రాస్తున్నారని ఆరోపించారు. పంచాయితీలు వద్దు, కూర్చుని చర్చించుకుందాం అన్న రేవంత్ రెడ్డి మాటల పరమార్థం తెలంగాణ నీటి వాటాను ఏపీకి గంపగుత్తగా అప్పచెప్పడమేనని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవడంలో ఎప్పుడూ ముందుండే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో దోస్తీ కట్టి, రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న రేవంత్ రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని హరీశ్ రావు హెచ్చరించారు. గురుదక్షిణ కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడితే చూస్తూ ఊరుకోబోమని, బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలో ఈ దుర్మార్గాన్ని ఎండగడుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని పటిష్టమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### - సుప్రీంకోర్టు ఏం చెప్పిందంటే.?

రాష్ట్రాల మధ్య జల వివాదాలు తలెత్తినప్పుడు నేరుగా రిట్ పిటిషన్ దాఖలు చేయడం కంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ ఫైల్ చేయడం సరైన మార్గమని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రాజెక్టు ఇంకా ప్లానింగ్ దశలోనే ఉన్నందున, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉందా అని న్యాయస్థానం ఇరు రాష్ట్రాలను ప్రశ్నించింది. ప్రస్తుతానికి స్టే ఇచ్చేందుకు నిరాకరించిన కోర్టు, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఈ అంశంపై చర్చలు జరపవచ్చని సూచించింది. దీంతో రిట్ పిటిషన్‌ను తెలంగాణ వెనక్కి తీసుకుంది. రెండు రోజుల్లో సివిల్ సూట్ ఫైల్ చేస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## వాహనాల చలాన్లకు డిస్కౌంట్ ఇవ్వొద్దు

ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుంటే, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా, వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే యజమాని బ్యాంకు ఖాతాను లింక్ చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మైనర్లు ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులపై కేసులు పెట్టాలని ఆయన ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల విషయంలో రవాణా శాఖ, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చాలా సందర్భాల్లో మన ప్రమేయం లేకున్నా, ఎదుటివారి తప్పుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. హైడ్రా, ఈగల్, సైబర్ క్రైమ్ విభాగాలను బలోపేతం చేసినట్లే, ట్రాఫిక్ నియంత్రణలోనూ పోలీస్ వ్యవస్థను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో జిల్లాల పునర్విభజన కమిటీ

ఆయన స్పష్టం చేశారు. జిల్లాల పేర్లు , పరిధిపై గతంలో జరిగిన కొన్ని మార్పులను ముఖ్యమంత్రి తప్పుబట్టారు. ముఖ్యంగా సికింద్రాబాద్ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు, తొలగింపు వ్యవహారాలపై ఆయన ప్రశ్నలు సంధించారు. సికింద్రాబాద్ గ్రేటర్ హైదరాబాద్ లో అంతర్భాగంగానే ఉందని గుర్తు చేశారు. పాలనలో కొన్ని పేర్లు రాచరికాన్ని పోలి ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే తాము రాచకొండ పోలీస్ కమిషనరేట్ పేరును మార్చామన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనేది కేవలం సరిహద్దుల మార్పు మాత్రమే కాదని, అది ప్రజలకు పాలనను దగ్గర చేసే ప్రక్రియగా ఉండాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చినప్పుడు తీవ్ర వివాదాలు చెలరేగాయి. జనగామ, మహబూబాబాద్, గద్వాల వంటి ప్రాంతాల్లో జిల్లా కేంద్రాల కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. కొన్ని మండలాలు తమకు సమీపంలో ఉన్న జిల్లా కేంద్రాల్లో కలపాలని కోరినప్పటికీ, ప్రభుత్వం తమ ఇష్టానుసారం విభజించిందనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా రెవెన్యూ డివిజన్లు, పోలీస్ సర్కిళ్ల పరిధి పరస్పరం పొంతన లేకుండా ఉండటంతో అడ్మినిస్ట్రేటివ్ సమస్యలు వస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ వివాదాలన్నింటినీ కమిటీ ద్వారా పరిష్కరించాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రస్తుత ప్రకటనతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య తగ్గుతుందా లేక పెరుగుతుందా అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే ప్రభుత్వం మాత్రం సంఖ్య కంటే శాస్త్రీయత కే ప్రాధాన్యత ఇస్తామని చెబుతోంది. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే మండలాలు, జిల్లాల సరిహద్దుల మార్పుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో రాజకీయ జోక్యం లేకుండా చూస్తామని, ప్రజల అభిప్రాయాలకు విలువ ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం రాష్ట్ర పాలనా యంత్రాంగంలో పెను మార్పులకు నాంది పలికే అవకాశం ఉంది. అయితే సెంటిమెంట్ రాజకీయాలు మాత్రం ఓ రేంజ్ లో జరిగే అవకాశం ఉంది. కమిటీ నియామకం తర్వాత అసలు రాజకీయాలు ప్రారంభం కానున్నాయి.

## సుప్రీంకోర్టులో ఈడీ VS దీదీ

చేరుకుని ఫైల్స్ జోక్యం చేసుకుని ఫైల్స్ తీసుకెళ్లడం గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు ఈ వ్యవహారం సుప్రీంకోర్టు గడప తొక్కింది. ఈడీ అధికారులు సుప్రీంకోర్టులో సోమవారం దాఖలు చేసిన పిటిషన్‌లో మమతా బెనర్జీపై సంచలన ఆరోపణలు చేశారు. జనవరి 8వ తేదీన ఐ ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు జరుగుతుండగా.. మమతా బెనర్జీ 200 మంది పోలీసులతో వచ్చి తమ అధికారులను అడ్డుకున్నారని ఈడీ సుప్రీంకోర్టుకు తెలిపింది. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న కీలక పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డిస్క్‌లు, మొబైల్ ఫోన్లను సీఎం మమతా బెనర్జీ, బెంగాల్ పోలీసులు బలవంతంగా లాక్కెళ్లారని ఆరోపించింది. ఈడీ అధికారులను బెదిరించి సుమారు రెండు గంటల పాటు పోలీస్ స్టేషన్‌లో ఉంచారని ఇది తాము చేస్తున్న దర్యాప్తును నీరుగార్చడమేనని ఫిర్యాదు చేసింది.

### - కుంభకోణం నేపథ్యం

దాదాపు రూ. 2,742 కోట్ల బొగ్గు కుంభకోణం, మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఇటీవల బెంగాల్‌లో ఈడీ దాడులు చేసింది. ఐ ప్యాక్ సంస్థ హవాలా మార్గంలో సుమారు రూ. 20 కోట్లను అందుకున్నట్లు ఈడీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. అయితే ఈడీ చేస్తున్న దాడులపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను వాడుకుంటోందని దీదీ ఆరోపించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. టీఎంసీ పార్టీ పత్రాలను, డేటాను దొంగిలిస్తున్నారని అమిత్ షాను ఉద్దేశించి సంచలన ఆరోపణలు చేశారు. బెంగాల్‌లో ఓటర్ల పేర్ల తొలగింపు ప్రక్రియకు ఈ ఈడీ దాడులకు సంబంధం ఉందని మమత బెనర్జీ ఆరోపించారు. కోల్‌కతా హైకోర్టులో ఈ అంశంపై విచారణ జరుగుతుండగా సీఎం మద్దతుదారులు కోర్టులో గందరగోళం సృష్టించారని.. అందుకే నిష్పాక్షిక విచారణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించామని ఈడీ తెలిపింది. ఈ సందర్భంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, డీజీపీ రాజీవ్ కుమార్, పోలీస్ కమిషనర్ మనోజ్ వర్మలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఈడీ సుప్రీంకోర్టును కోరింది. ఈడీ అధికారులపై నమోదైన పోలీసు కేసులపై స్టే విధించాలని, స్వాధీనం చేసుకున్న డిజిటల్ సాక్ష్యాలను భద్రపరచాలని విజ్ఞప్తి చేసింది.

## దివ్యాంగుల జంట పెళ్లి చేసుకుంటే రెండు లక్షలు సహాయం

జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సమాజంలో దివ్యాంగులు ఆత్మగౌరవంతో నిలబడే విధంగా సహాయ సహకారాలు అందించడంలో ప్రభుత్వం మానవీయ కోణంలో పనిచేస్తుంది అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దివ్యాంగులు కుటుంబానికి భారమవుతున్నామని ఆత్మన్యూనతతో ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

### - దివ్యాంగులు క్రీడల్లో రాణించాలి

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం దివ్యాంగుల కోసం బాల భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే ప్రాణం వయోవృద్ధుల కోసం డే–కేర్ సెంటర్లను విర్చువల్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం రూ. 50 కోట్లు కేటాయించి అవసరమైన ఉపకరణాలను అందించి దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం కల్పించడానికి ప్రయత్నిస్తుందని చెప్పారు. పోటీ ప్రపంచంలో తాము వెనకబడ్డామన్న ఆలోచన రాకుండా అన్ని రంగాల్లో దివ్యాంగులకు అవకాశం కల్పిస్తున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దివ్యాంగులు క్రీడల్లో రాణించే విధంగా అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తున్నాం అని స్పష్టం చేశారు. ప్యారా ఒలింపిక్స్‌లో రాణించిన అమ్మాయికి ఉద్యోగం ఇచ్చాం. దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను అందిపుచ్చుకోవాలి అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### - ట్రాన్స్‌జెండర్‌ను నామినేట్ చేయాలి

'దివ్యాంగులకు సూదిని జైపాల్ రెడ్డి స్ఫూర్తిగా నిలుస్తారు. ఏ రోజూ వైకల్యం అన్న ఆలోచన కూడా రానివ్వలేదు. దేశంలోనే ఒక మేధావిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎదిగిన గొప్ప నాయకుడు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి.'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'ట్రాన్స్‌జెండర్ల విషయంలో కూడా సమాజం వివక్ష చూపించడం, కుటుంబ నిర్లక్ష్యానికి గురయ్యే వారికి వివిధ శాఖల్లో ప్రభుత్వం ఉద్యోగం కల్పించడమే కాకుండా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తోంది. వారికి సమాజంలో సముచిత గౌరవం ఇవ్వడానికి, వారి హక్కుల గురించి వారే మాట్లాడే విధంగా మున్సిపల్ కార్పొరేషన్లలో కో–ఆప్షన్ సభ్యులుగా ఒక ట్రాన్స్‌జెండర్‌ను నామినేట్ చేయాలని సూచన చేశారు. మైనారిటీలకు వివిధ జిల్లా పరిషత్‌లలో మున్సిపాలిటీల్లో కో–ఆప్షన్ తీసుకున్నట్టే ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రాతినిధ్యం ఇవ్వగలిగితే ప్రభుత్వం తమ పట్ల మానవత్వంతో చూస్తుందని, అండగా నిలుస్తుందన్న విశ్వాసం వారికి కలుగుతుందని, కో–ఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేసే అంశంపై మంత్రివర్గ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని ఆలోచన'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

### - వృద్ధుల కోసం ప్రణామమ్ డే కేర్

'వృద్ధ తల్లిదండ్రులు వారి రక్తాన్ని చమటగా మార్చి పిల్లలకు ఆస్తులు, విద్యను అందిస్తే, వయసు మీద పడినప్పుడు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వమే ఒక కుటుంబ పెద్దగా మారి ప్రణామ్ పేరుతో డే–కేర్ సెంటర్లను ప్రారంభిస్తోంది.'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారు ఎవరైనా తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, దానిపై ఫిర్యాదు అందితే ఉద్యోగస్తుల జీతాల్లోంచి 10 నుంచి 15 శాతం మేరకు కోత విధించి ఆ మొత్తాన్ని తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసే విధంగా చట్టంలో మార్పు తేవలసిన అవసరం ఉంది.'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### - ఎస్సీ వర్గీకరణ పూర్తి చేశాం

'తెలంగాణలో పేదలకు వంద శాతం వైద్య సహాయం అందించాల్సిన అవసరం ఉంది. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో సమగ్రమైన హెల్త్ పాలసీ తీసుకొస్తాం. తెలంగాణ సమాజం సామాజిక న్యాయం, సమాన అవకాశాలను కోరుకుంటోంది. అందులో భాగంగానే వందేళ్లుగా జరగని కుల గణనను విజయవంతంగా పూర్తి చేశాం. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను పూర్తి చేశాం.'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'దేశంలో 2026 లో చేపడుతున్న జనభా లెక్కల్లో తెలంగాణ మాడల్‌ను ప్రమాణికంగా తీసుకుని కులగణన చేపడుతోందని చెబుతూ ఆ విషయాన్ని తెలంగాణ గర్వంగా చెప్పుకోగలదు. రెండేళ్లలో సమస్యలన్నీ పరిష్కారమయ్యాయని చెప్పను. కానీ ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుంది. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ప్రణాళికా బద్ధంగా తెలంగాణ ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, పేద ప్రజలకు అండగా నిలిచే తొలి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీతో నడిచే త్రిచక్ర వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు, మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలను పంపిణీ చేశారు.

## చిత్తూరు జిల్లా గుడిపాల మండలం బట్వాలూరు గ్రామంలో ఏనుగుల విధ్వంసం

**చిత్తూరు** చిత్తూరు జిల్లా గుడిపాల మండలం బట్వాలూరు గ్రామ పరిధిలో ఏనుగులు రైతు పొలాల్లోకి చొరబడి తీవ్ర విధ్వంసం సృష్టించాయి. ఫారెస్ట్ ప్రాంతంలో దాదాపు 15 ఏనుగులు దాక్కుని ఉన్నప్పటికీ, అటవీ శాఖ అధికారులు ముందస్తు హెచ్చరికలు ఇవ్వకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల దాడితో మామిడి తోటలు పూర్తిగా ధ్వంసం కాగా, రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై స్పందించాల్సిన ఫారెస్ట్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీసింది. ఇదిలా ఉండగా, కుసుమ కుమారి అనే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్పై తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏనుగుల వల్ల మామిడి తోట నష్టపోయిన రైతు శంకర్ నాయుడు ఆరోపణకట్లలోడు ఇటికలు బట్టి ఆవేదన వ్యక్తం చేశారు వాళ్ళ వద్ద వద్ద నుంచి రూ. 10,000 లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
అదేవిధంగా, ఇంట్లో వంట చేసుకునేందుకు అటవీ ప్రాంతంలో ఎండిపోయిన పుల్లలు ఏరుకుంటున్న మేస్త్రి సీతాలు పనిచేస్తున్న పేద కుటుంబాన్ని బెదిరించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తొలుత రూ. 10,000 డిమాండ్ చేసి, చివరికి రూ. 5,000 ఇవ్వకపోతే కేసు పెడతానని బెదిరించినట్లు బాధితులు చెబుతున్నారు. ఇంకా, కలెక్టర్ కార్యాలయం సమీపంలో ముష్టికాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న అనుపు. ఎస్టీ కాలనీకి చెందిన ముసలవ్వమహిళ వద్ద నుంచి కూడా రూ. 5,000 డిమాండ్ చేసి, చివరకు రూ. 2,500 వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. లంచం ఇవ్వకపోతే కేసు పెడతానని బెదిరించడమే కాకుండా, ఆమె వద్ద ఉన్న ముష్టికాయలను కూడా తీసుకెళ్లినట్లు బాధితులు వాపోతున్నారు. ఈ ఘటనలపై చుట్టుపక్కల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సంబంధిత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమ కుమారి పై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

## స్వామి వివేకానంద బోధనలు
# యువతకు మార్గదర్శకం

- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నేత : అనుముల భాస్కర్
- స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువతకు భాస్కర్ సందేశం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు అనుముల భాస్కర్ సోమవారం జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువతకు సందేశాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,“స్వామి వివేకానంద యువతకు ఆదర్శప్రాయమైన మహానుభావుడు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ యువత కష్టపడి చదివి, క్రమశిక్షణతో జీవిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారు విద్య, నైపుణ్యం, సేవాభావంతో ముందుకు సాగితే భారత్ విశ్వగురువుగా నిలుస్తుంది” అని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిరంతరం శ్రమిస్తే విజయాలు తథ్యమని ఆయన సూచించారు. స్వామి వివేకానంద బోధనలు ప్రతి యువకుడి జీవితానికి మార్గదర్శకమని అనుముల భాస్కర్ పేర్కొన్నారు.

# మృతుడు ప్రవీణ్ కుటుంబానికి అండగా నిలిచిన కేంద్రమంత్రి బండి సంజయ్

- మృతుడు ప్రవీణ్ మృతదేహాన్ని భారత్ కు రప్పించేందుకు బండి సంజయ్ చర్యలు
- విదేశాంగ శాఖను సంప్రదించిన కేంద్రమంత్రి బండి - వేగంగా చర్యలు
- బాధిత కుటుంబానికి బండి ప్రగాఢ సంతాపం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన మేకల ప్రవీణ్ (33).అనే యువకుడు ఉపాధి కోసం ఆరు నెలల క్రితం యూరప్ దేశమైన ఆర్మేనియాకు వెళ్లగా, మూడు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం అందింది. ప్రవీణ్ మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు కుటుంబ సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్‌ను సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించారు. విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడి, మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తరలించే ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన యువకుడు ఈ విధంగా ప్రాణాలు కోల్పోవడం ఎంతో విషాదకరమని, ప్రవీణ్ కుటుంబానికి ఈ క్లిష్ట సమయంలో కేంద్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అలాగే శోకతప్తంలో నిండిన ప్రవీణ్ కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# వివేకానందుని ఆదర్శాలతో యువత ముందుకు సాగాలి

- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పర్శరాం
- మండల కేంద్రంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానందుడని, యువతకు ఆయన బోధనలు మార్గదర్శకమని అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని యువత వివేకానందుని ఆదర్శాలతో వికసిత భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మెరుపుల గంగాధర్, బోగోజి గంగాధర్ చారి, అనిల్, మహేష్, సాయికుమార్, ముసుకు విజయేందర్ రెడ్డి, ధర్మేంద్ర, మనోజ్, ఐలయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీకి ముస్తాబయిన బాలకృష్ణనగర్ : మహమ్మద్ జాంగిర్

## మహిళ మహారాణుల ముగ్గుల పోటీలు



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) నేడు బాలకృష్ణ నగర్ లో నిర్వహించే ముగ్గుల పోటీలకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఈ కార్యక్రమం నిర్వాహకులు బాలకృష్ణ నగర్ గౌరవ అధ్యక్షులు మహమ్మద్ జాంగిర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని నేడు ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బాలకృష్ణ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో విజయం సాధించిన మహిళలకు మొదటి బహుమతిగా రూపాయలు 5000 రెండవ బహుమతిగా రూపాయలు 3000 మూడో బహుమతిగా రూపాయలు 2000 తో పాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి మహిళ సోదరీమణులకు తప్పనిసరిగా బహుమతులు అందజేస్తామని ఈ ముగ్గుల పోటీలో పాల్గొనే మహిళలు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు స్రవంతి 80 19 23 84 35, నాగలక్ష్మి 95 154 50 815 సంప్రదించవలసినదిగా మహమ్మద్ జాంగిర్ తెలిపారు.

# పందానికి సై అంటున్న కోళ్లు

- --నై అంటున్న పోలీసులు
- ఏపీ లో కోడిపందాలకు హైటెక్ బరులు
- ఈనెల 12 నుంచి 16 వరకు ఏపీలో కోడి పందాల జాతర
- ఈ మేరకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు
- పందాలకు రావాలని ఆహ్వాన పత్రికలు
- కోడి పందాలు చట్ట విరుద్ధం, ప్రకటిస్తున్న పోలీస్ అధికారులు
- అయినా పందాలు జరిపేందుకు నిర్వాహకులు సన్నాహాలు
- పందాలు అడ్డుకుంటాం అంటున్న పోలీసులు
- అయినా “తగ్గేదేలే”అంటున్నారు నిర్వాహకులు

**(వెంకట్-- ఆంధ్రప్రదేశ్ ప్రశ్న న్యూస్ చీఫ్ బ్యూరో)**

ఏపీలో సంక్రాంతి సంబరాలకు రంగం సిద్ధమైంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే కోడిపందాలు హైటెక్ రూపును సంతరించుకుంటున్నాయి. ఏపీలో ప్రతి సంవత్సరం వేలకోట్ల రూపాయల కోడిపందాలు జరుగుతున్నాయి. క్రాస్ బ్రీడ్ కోడిపుంజుల తో జరిగే ఈ కోడిపందాలకు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో బరులు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో కోడి పందాల కోసం భారీ బరులు రెడీ అవుతున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నూజివీడు గన్నవరం సరిహద్దు ప్రాంతాల్లో భారీ స్థాయిలో కోడి పందేల నిర్వహణకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. దాదాపు 28 ఎకరాల విస్తీర్ణంలో హైటెక్ బరులను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏర్పాట్లకు కోట్ల రూపాయల మేర ఖర్చు చేసినట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిరంతరాయంగా కోడి పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ఇప్పటికే రాష్ట్రంలోని పలువురు ప్రముఖులకు కోడిపందాలను నిర్వహిస్తున్నట్టు, వారంతా తప్పనిసరిగా రావాలని ఆహ్వానపత్రికలు పంపినట్లు తెలుస్తోంది. కోళ్ళ పందేలు జరిగే ప్రాంతాల్లో అత్యంత రహస్యంగా ఏర్పాట్లు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వీఐపీల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లను కూడా భారీగా చేస్తున్నారు. నూజివీడు గన్నవరం సరిహద్దు ప్రాంతంలో ఏర్పాట్లు చేస్తున్న బరుల వద్ద బౌన్సర్లను ప్రత్యేకంగా నియమించినట్లు సమాచారం. పందేలు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక గ్యాలరీలు, విశ్రాంతి గదులు, పార్కింగ్ సదుపాయాలతో పాటు ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. రోజువారీగా కోట్ల రూపాయల విలువైన పందేలు జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నిర్వాహకులు విజేతలకు భారీ బహుమతులు ప్రకటించడంతో ఈ పందేలపై పెద్ద ఎత్తున ఆసక్తి పెరుగుతోంది. ఒక్క ఏపీ నుంచే కాకుండా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పందేల్లో విజయం సాధించిన వారికి బ్రెజా, థర్ వంటి కార్లను బహుమతులుగా ప్రకటించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, కోడి పందేలు చట్ట విరుద్ధమని ఇప్పటికే పలుమార్లు అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. అయినప్పటికీ ప్రతి ఏటా సంక్రాంతి సమీపించగానే ఈ తరహా కార్యక్రమాలు తెరపైకి రావడం గమనార్హం. ఈ వ్యవహారంపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. పందేలు జరగకుండా చర్యలు తీసుకుంటారా..? లేక ప్రతి ఏడాది మాదిరిగానే పర్యవేక్షణతో పరిమితం అవుతారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

ప్రతి ఏడాది పోలీసులు ప్రతిఘటిస్తున్న

### కోడిపందాలు షరా మామూలే ..

సంక్రాంతి రోజు నుంచి మూడు,ఐదు రోజులపాటు జరిగే కోడి పందాలు నిర్వహించకుండా పోలీసులు ఒకవైపు ప్రతిఘటిస్తున్న ప్రతి ఏడాది జరిగే పందాలు జరుగుతూనే ఉన్నాయి. భోగి రోజు ముహూర్తం పెట్టుకుని మరీ నిర్వహకులు పందాలు ప్రారంభిస్తారు. భోగి ముందు రోజు వరకు పోలీసులు పందాలు జరక్కుండా చేసిన ప్రయత్నాలన్నీ భోగి రోజు మధ్యాహ్నం తో పటాపంచలవుతాయి. ఇక ఏపీ మొత్తం కోడిపందాల నిర్వహకుల చేతుల్లోకి పోతోంది. ఆ మూడు రోజులు పోలీసులు మౌనవహిస్తారు. ఈ మౌనం వెనక ఎవరెవరు వత్తిళ్లు ఉన్నాయో ఆ పరమాత్ముడికి ఎరుక. ఇక సంక్రాంతి అంటేనే ప్రతీ ఒక్కరికి ఆంధ్రప్రదేశ్ గుర్తుకు వస్తుంది. పంట చేతికి వచ్చి అందరూ సంతోషంగా జరుపుకునే పండుగతో పాటు ఏపీలో సంక్రాంతి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది కోడిపందాలు. ప్రతి ఏటా వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిమంది ఏపీకి వచ్చి కోడిపందాలను ప్రత్యక్షంగా వీక్షిస్తుంటారు. కోట్ల రూపాయల పందేలు, రక్తపాతంతో కూడిన కోళ్ళ కత్తుల యుద్ధం అడ్డుకోవటానికి ప్రభుత్వం ఎంత ప్రయత్నం చేసినా కోడి పందాలు కొనసాగుతూనే ఉంటాయి, ఉంటున్నాయి. పందెం కోళ్లకు ప్రత్యేక ఆహారం, కఠినమైన శిక్షణ ఇచ్చి 18 నెలల నుండే రెడీ చేస్తున్నారు. చివరికి ఆ కోళ్లు అన్ని సంక్రాంతి కోడిపందాల బిర్రులకు బలవుతాయి. పందాలలో మిగిలిన కోళ్లు తిరిగి వచ్చే సంవత్సరం వరకు బలమైన ఆహారం ఇచ్చి మేపి పందాలకు



సిద్ధం చేస్తారు. అయితే ఈసారి గతానికి భిన్నంగా క్రాస్ జనరేషన్ కోడిపుంజులు హవా కొనసాగబోతుందనే చర్చ ఏపీ వ్యాప్తంగా వినిపిస్తోంది. గత ఏడాది కూడా క్రాస్ పుంజులు చాలా స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచాయి. అమెరికన్ గేమ్ పాల్, అమెరికన్ పెర్విన్, బ్రెజిల్ జాతి కోళ్లను దేశీయ డేగ, నెమలి జాతులతో క్రాసింగ్ చేసి కొత్త పుంజులను తయారు చేస్తున్నారు. ఈ క్రాస్ కోడిపుంజుల ధర లక్ష రూపాయలకు పైగానే ఉంటుందని చెప్తారు. కేవలం సంక్రాంతి కోడిపందాల కోసమే అనేక కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసినట్టు తెలుస్తుంది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాల్లో వందల కొద్దీ శిక్షణ కేంద్రాల్లో ఈ క్రాస్ పుంజులకు తర్ఫీదు ఇస్తున్నారు. జోరుగా ఏపీలో కోడిపందాలకు బరులు రెడీ అయినా నేపథ్యం లో నెలకు 15వేల జీతంతో శిక్షకులను నియమించి, 18 నెలలపాటు పుంజులను పోరాటాలకు సిద్ధం చేస్తున్నారు. గతేడాది జనవరిలో కోడిపందాల ద్వారా దాదాపు 2000 కోట్ల వరకు చేతులు మారాయని అంచనా. అదే విధంగా మద్యం కూడా ఏరులై పారుతుంది. గత ఏడాది సుమారు 500 కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు జరిగినట్లుగా తెలుస్తోంది. ఏడాది మరో రెండు మూడు కోట్లు మద్యం అమ్మ కాదు పెరిగా అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కోడిపందాలు జోరుగా జరగనున్నాయని, కోనసీమ, గుంటూరు, కృష్ణ జిల్లాల్లో ఇప్పటికే బరులు సిద్ధమవుతున్నాయని అంటున్నారు. పందాల కోసం వచ్చే వారు ముందుగానే హోటళ్లు, లాడ్జీలు బుక్ చేసుకుంటున్నారు. మరోవైపు కోడిపందాలు కట్టడికి పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా పోలీస్ అధికారులు, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. యువత కోడిపందాలకు ఆకర్షితులకు కాకుండా పలు జిల్లాల్లో పోలీసులు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు మాత్రం పందాలకు సిద్ధమవుతున్నారు. కోడి పందేల కట్టడికి ప్రభుత్వం పోలీసులు ఏం చేసినా కోడి పందాలు కొనసాగుతాయి. ఈసారి క్రాస్ జనరేషన్ కోడిపుంజులతో కోడిపోరు మరింత రంజుగా సాగుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

# యదేచ్ఛగా రహదారులపై అక్రమ నిర్మాణాలు

## అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న ఏసిపి, సెక్షన్ ఆఫీసర్

- ముషీరాబాద్‌లో జిహెచ్ఎంసి నిబంధనలకు తూట్లు
- సెల్లార్, అనుమతిలేని అంతస్తులకు అధికారుల సహకారం
- లక్షల్లో అవినీతి జరిగినట్టు స్థానికుల ఆరోపణ
- నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకొని ఎసిపి దేవేందర్



ముషీరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పేరుతో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కానీ ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న కొన్ని నిర్మాణాలు మాత్రం అభివృద్ధికి భిన్నంగా అక్రమాలకు నిలువెత్తు రూపంగా మారుతున్నాయి. ప్రధాన రహదారులకే ఆనుకొని అక్రమ సెల్లార్‌లు, అనుమతిలేని అంతస్తులు నిర్మించబడుతున్నా, వాటిని అడ్డుకోవాల్సిన జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలు తీసుకొని మౌనం పాటిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### జిహెచ్ఎంసి నియమ నిబంధనల కాగితాల కేనా.?

జిహెచ్ఎంసి నిర్మాణ నిబంధనల ప్రకారం రహదారులపై సెల్లార్ నిర్మాణానికి స్పష్టమైన ఆంక్షలు ఉన్నాయి. రోడ్ల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజల సౌకర్యం దృష్ట్యా ఈ నియమాలు రూపొందించబడ్డాయి. అయినప్పటికీ ముషీరాబాద్ పరిధిలో ఈ నిబంధనలు కాగితాలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో పూర్తిగా విస్మరించబడుతున్నాయి.

### అక్రమ నిర్మాణాలలో అధికారుల పూర్తి హస్తం

అక్రమ నిర్మాణాలు ఒక్కసారిగా వెలిసేవి కావు. ప్లాన్ అప్రూవల్ నుంచి ఫౌండేషన్, సెల్లార్ తవ్వకం, అంతస్తుల నిర్మాణం వరకు ప్రతీ దశలో టౌన్ ప్లానింగ్ అధికారుల తనిఖీలు తప్పనిసరి. అయిన అక్రమ నిర్మాణాలు



నిర్బంధం లేకుండా కొనసాగుతున్నాయంటే, అధికారుల పూర్తి నిర్లక్ష్యం లేదా ప్రత్యక్ష సహకారమే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయిన అధికారులు వాటిని లెక్క చేయకుండా అక్రమ నిర్మాణాలకు సహకారం ఇస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

### లంచాలు ఇస్తే అధికారులు పట్టించుకోరా.?

స్థానికుల ఆరోపణల ప్రకారం, ముషీరాబాద్ సర్కిల్‌లో కొందరు అధికారులు అక్రమ నిర్మాణాలపై నోటీసులు ఇవ్వకుండా వదిలేయడం, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోకపోవడం, పత్రికలో కథనాలు వచ్చిన పట్టించుకోకపోవడం వంటి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఇది లంచాల వ్యవస్థ బలపడుతోందన్న అనుమానాలకు బలం చేకూరుస్తోంది. టౌన్ ప్లానింగ్ అధికారులు దర్జాగా లంచాలు తీసుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు అన్న విషయం ఉన్నత అధికారులకు తెలిసిన మౌనంగా ఉండడం వెనక వాళ్లకు కూడా వాటాలు



అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు కోట్లలలో అక్రమ ఆస్తులు సంపాదించారనడంలో అతిశయోక్తి లేదు. ముషీరాబాద్ సర్కిల్ కు సంబంధించి రిటైర్మెంట్ కు దగ్గరలో ఉన్న ఓ టౌన్ ప్లానింగ్ అధికారి దాదాపు 300 కోట్ల వరకు అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారని అతని సంపాదించిన అక్రమాస్తులను బొంబాయి హైవేలో భూములు కొనుగోలు చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

### ప్రమాదాల బాటలో ప్రజలు..

అక్రమ సెల్లార్‌లు, అధిక అంతస్తులు,భవనాల నిర్మాణ స్థిరత్వంపై ప్రభావం పడి రహదారులు కుంగిపోయే ప్రమాదం ఉందని, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు వంటి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అయిన ప్రజల భద్రత కంటే ప్రభుత్వంలో అక్రమాలకు అనుకూల వాతావరణమే ఎక్కువగా కనిపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముషీరాబాద్ రహదారిపై పిల్లర్ నంబర్ 22 ముందు పక్కింటి నెంబర్ 1--9--379/210/1 జవహర్ నగర్, అశోక్ నగర్ క్రాస్ రోడ్ లో అక్రమ సెల్లార్ అక్రమ అంతస్తులతో ఓ భారీ నిర్మాణం జరుగుతుంటే దీని వెనక అసిస్టెంట్ సిటీ ప్లానర్ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య పూర్తి సహకారం అందించి భారీగా సొమ్ము చేసుకుని సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### జిహెచ్ఎంసి ఆదేశాలకు తూట్లు

రాష్ట్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఆదేశించినా, ముషీరాబాద్ సర్కిల్‌లో మాత్రం ఆ ఆదేశాలు అసలు అమలవుతున్న దాఖలాలు కనబడటం లేదు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు



తీసుకోవాల్సిన అధికారులు, వారిని రక్షించే ధోరణి అవలంబిస్తున్నారన్న ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్ఠకే సవాల్‌గా మారుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయాన్ని పూర్తిగా కొల్లగొడుతున్నారు.

### విజిలెన్స్ విచారణ చేయాలి

ముషీరాబాద్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు సమగ్ర సర్వేను నిర్వహించి బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని అక్రమ సెల్లార్‌లు, అంతస్తులను కూల్చివేయాలని పలువురు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### జోనల్ కమిషనర్ మౌనం ఎందుకు.?

అక్రమ నిర్మాణాలపై ఇప్పటికైనా చర్యలు ఉంటాయా.?లేదా.?నిబంధనలు కాగితాలకే పరిమితమై, ప్రజల భద్రత ప్రమాదంలోనే కొనసాగుతుందా.? ముఖ్యమంత్రి కార్యాలయము, జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ స్పందించకుంటే ఇక ప్రభుత్వ నియమనిబంధనలు ఎందుకని మున్సిపల్ చట్టాన్ని పూర్తిగా తొలగించి ఎవరు ఎలా నిర్మించుకున్న పట్టించుకోకుంటే సరిపోతుంది కదా ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొన్నదని పేరుకే మున్సిపల్ చట్టం అధికారులే దానిని లెక్క చేయనప్పుడు ఇక ఎవరికోసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఘనంగా కూడారై మహోత్సవాలు

**- 108 రకాల పాయస, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు**



వేములవాడ.(ప్రశ్న న్యూస్) ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా వేములవాడ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో 27వ రోజైన కుడారై మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 108 పాయస నైవేద్యాలను సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బూరుగడ్డ కిరణ్ కుమారాచార్యులు మాట్లాడుతూ, ధనుర్మాసం ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం కలిగించడమే లక్ష్యంగా కొనసాగుతున్నాయని, భక్తులందరూ నియమ నిష్ఠలతో పాల్గొనడం శుభఫలితాలను ఇస్తుందని అన్నారు. ఈ నెల 14వ తేదీ (బుధవారం) సాయంత్రం శ్రీ గోదాదేవి -- శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణంను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దైవకృప పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మరింగంటి గిరిధరాచార్యులు, రాచకొండ బాణాచార్యులు, అభిరామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## గద్దె కోసం హిందూ దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి తర్వాత విమర్శించడం మానుకోవాలి

**-హిందూ దేవుళ్ళ జోలికి వస్తె సహించేది లేదు**
**కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం చేతల ప్రభుత్వం కాదు**
**రెండున్నర ఏళ్లలో సీడీపీ నిధులు శూన్యం**
**హామీలు నెరవేర్చకుండా కార్పొరేషన్ ఎన్నికల్లో ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారు**
**మీడియా సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**

నిజామాబాద్(ప్రశ్న న్యూస్) రెండున్నర ఏళ్లలో సీడీపీ నిధులు శూన్యం, కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం చేతల ప్రభుత్వం కాదని, హామీలు నెరవేర్చకుండా కార్పొరేషన్ ఎన్నికల్లో ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఎద్దేవా చేశారు. సోమవారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశం కోసం ధర్మం కోసం పని చేస్తున్న ఏకైక పార్టీ బిజెపి అన్నారు. నిజమైన సెక్యులర్ పార్టీ బీజేపీ మాత్రమేనని, కులాలు, మతాలు మరియు రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న పార్టీ బిజెపి మాత్రమే అని అన్నారు. ఓడిన కాంగ్రెస్ అభ్యర్థికి పది కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో తెలుపాలన్నారు. అర్బన్ ను 500 కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చెప్పడం పచ్చి అబద్ధం అన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వ పథకాలు కాపీ కొడుతున్నారన్నారు. దేశంలో సీడీపీ ఫండ్ ఇవ్వని రాష్ట్రం ఏది లేదని, ఒక్క తెలంగాణ రాష్ట్రం మాత్రమే ఇలా వ్యవహరిస్తుంది అని అన్నారు. ఫండ్ లేకుండా గ్రామాలకు ఎలా వెళ్లాలని 26 నెలలుగాకాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా అడగడం విడ్డూరమన్నారు. అర్బన్ లో ముఖ్యమైన అంశాల మీద ఫోకస్ పెట్టీ, సమస్యలపై సిఎంకు, మంత్రులకు ఇప్పటివరకు అనేక ఉత్తరాలు రాశారని ఒక్కదానికి కూడా సమాధానం లేదన్నారు. టీఆర్ఎస్ పదేళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వడంలో విఫలమయ్యిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గానికి 3500 ఇండ్లు అని చెప్పి సగం కూడా సాంక్షన్ చేయలేదన్నారు. నిజామాబాద్ బస్టాండ్, ప్రభుత్వాసుపత్రి, కళాభారతి గురించి ఉత్తరాలు రాసిన అటు సీఎం కానీ ఇటు పిసిసి కానీ పట్టించుకోకపోవడం దౌర్భాగ్యం అన్నారు. రేవంత్ రెడ్డి గద్దె కోసం కేవలం హిందూ దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి తర్వాత విమర్శించడం ముమ్మాటికి తగదన్నారు. మహేష్ కుమార్ గౌడ్ రాముడు గురించి మాట్లాడటం మానుకోవాలని హెచ్చరిస్తూ ఆ రాముడి ఆశీర్వాదంతోనే ప్రపంచంలో అత్యధిక మెంబర్షిప్ మరియు దేశంలో 21 రాష్ట్రాలలో అధికారంలో ఉందన్నారు. ఏమీ చేయని మీకు రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో ప్రజలు కర్ర కాల్చి వాత



పెట్టడం ఖాయమన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగరవేయడం ఖాయం అన్నారు. నిజామాబాద్ బరాబర్ ఇందూరేనని, కార్పొరేషన్ గెలుచుకోగానే పేరును మార్చే ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. హిందూ దేవతలు అలుకగా దొరికారా,హిందూ దేవుళ్ళ జోలికి వస్తె ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ,పోతంకర్ లక్ష్మి నారాయణ,బీజేపీ జిల్లా కార్యదర్శి జోతి, బీజేపీ నాయకులు న్యాలం రాజు,ప్రమోద్, ప్రభాకర్, తారక్ వేణు,ఇప్పకాయల కిషోర్, బట్టు రాఘవేందర్, మల్లేష్ యాదవ్, పుట్ట వీరేందర్, హరీష్ రెడ్డి, కార్తీక్, మధు,భాస్కర్, విజయ్, వినోద్, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఔనత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిన మహనీయుడు స్వామి వివేకానంద

**- మొల్లమాంబ వృద్ధాశ్రమంలో అన్నసంతర్పణ, రగ్గులు, లడ్డులు పంపిణి.**



గిద్దలూరు (ప్రశ్న న్యూస్) హైందవ సమాజం బలోపేతంతో పాటు భారత దేశ ఔనత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటుతూ యువతకు స్ఫూర్తి దాయకంగా నిలిచిన మహనీయుడు స్వామి వివేకానంద అని నవ చైతన్య వివేకా సేవా సమితి అధ్యక్షులు నోముల వెంకట చలపతి, గిద్దలూరుకు చెందిన విశ్రాంత ఆచార్యులు సూరం నారాయణ రెడ్డి పేర్కొన్నారు. స్వామి వివేకానంద 163 జయంతి సందర్భంగా సోమవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి తాలూకా సెంటర్ వివేకానంద విగ్రహం వద్ద జరిగిన వేడుకలో వారు మాట్లాడారు. సుమారు 130 సంవత్సరాల క్రితమే దేశ ఔన్నత్యం, యువత ప్రాధాన్యత, హైందవ సంస్కృతి సాంప్రదాయాల విలువలు ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన వివేకనందుడు లాంటి ఆణిముత్యం మనకు దొరకటం అదృష్ట మని కొనియాడారు. తన మేధస్సు, సరళమైన స్వరంతో ప్రపంచ దేశాలను, యువతను ఆకట్టుకొని వారికి మార్గదర్శంగా నిలిచిన యుగపురుషుడు వివేకానందని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ కొనియాడారు. యువత ఎప్పుడూ స్వేచ్ఛ కలిగి ఉండాలని అయితే ఆ స్వేచ్ఛలో కాస్త బాధ్యత ఉండాలని అప్పుడే వారి జీవితం సరైన దారిలో నడుస్తుందని చెప్పారు. తొలుత 25 అడుగుల వివేకానంద విగ్రహం, చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించి లడ్డులు పంపిణి చేశారు. అనంతరం మొల్లమాంబ వృద్ధాశ్రమంలో అన్నసంతర్పణ, రగ్గులు, లడ్డులు పంపిణి చేశారు కార్యక్రమంలో విప్పర్ల పాండురంగరావు, నాసరయ్య, కొత్తా లక్ష్మయ్య, భాజపా పట్టణ అధ్యక్షులు కందకట్ల శంకరావు, కోటేశ్వరరావు, న్యాయవాది బూతుకూరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లాలాపేట రహదారిపై పొంగుతున్న డ్రైనేజీ పట్టించుకోని శాంతినగర్ జలమండలి మేనేజర్

**తక్షణ చర్యలు తీసుకోవాలని**
**మంత్రి వినోద్ డిమాండ్**

తార్నాక (ప్రశ్న న్యూస్) లాలాపేట రహదారి రోడ్డు విస్తరణ పనులు జరుగుతుంటే మరోపక్క రోజుల తరబడి డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక నాయకుడు మంత్రి వినోద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు నీరు రహదారిపై నిలిచిపోవడంతో దుర్వాసన వ్యాపించి, రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. పాఠశాల విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నప్పటికీ జలమండలి అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డిప్యూటీ మేయర్ డివిజన్లో పరిస్థితి ఇంత దారుణంగా ఉందని జలమండలి మేనేజర్ నిర్లక్ష్యంతో ఎప్పుడు రహదారిపై డ్రైనేజ్ లీక్ అవుతున్న పట్టించుకోవాలని మండిపడ్డారు. ప్రజల నుంచి పలుమార్లు ఫిర్యాదులు వెళ్లినప్పటికీ శాంతినగర్ జలమండలి మేనేజర్ స్పందించకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని



స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మంత్రి వినోద్ లాలాపేట రహదారిపై డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. అదేవిధంగా రోడ్డు విస్తరణ పనులలో నాణ్యత లోపించిందని కాంట్రాక్టర్ నాసిరకమైన పనులు చేస్తున్నారని గతంలో లాలాపేట బ్రిడ్జి పనులను కూడా ఇదే



కాంట్రాక్టర్ నాసిరకంగా చేసిన కూడా అధికారులు లోపాయికారి ఒప్పందంతో అదే కాంట్రాక్టర్ కు పనులు అప్పగించడం జరుగుతుందని ఆరోపించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని హెచ్చరించారు. బాధ్యులైన జలమండలి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని



డిమాండ్ చేశారు. అధికారుల, కార్పొరేటర్ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ప్రజల సహనానికి పరీక్ష పెట్టవద్దని మంత్రి వినోద్ స్పష్టం చేశారు. ఇకనైనా జలమండలి అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తారా.? లేక ప్రజల ఆగ్రహాన్ని మరింత పెంచుతారా.? అని మంత్రి వినోద్ అధికారులను హెచ్చరించారు.

## మృతుడు ప్రవీణ్ కుటుంబానికి ఎడపల్లి బాబు పరామర్శ - ప్రగాఢ సంతాపం - ఆర్థికసాయం

**- ప్రవీణ్ మృతి అత్యంత బాధాకరం - ఎడపల్లి బాబు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన మేకల ప్రవీణ్ (33) ఉపాధి కోసం యూరప్ దేశమైన ఆర్మేనియాకు గత 9 నెలల క్రితం వెళ్లాడు. ఈ నెల 9వ తేదీ (శుక్రవారం) జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటన నేపథ్యంలో సోమవారం గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన ఎడపల్లి బాబు ప్రవీణ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతుని కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతి,సంతాపం తెలియజేస్తూ రూ.10,000 నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎడపల్లి బాబు మాట్లాడుతూ,"ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందడం అత్యంత విషాదకరం. ప్రవీణ్ కుటుంబానికి ఇది తీరని లోటు. ఈ కష్టకాలంలో వారికి మేము అండగా ఉంటాం. గ్రామస్తులందరూ కూడా ఈ కుటుంబానికి సహాయం చేయాలి" అని కోరారు. అనుకోని విధంగా కుటుంబ పెద్దను కోల్పోయిన వారి బాధను పంచుకుంటూ ఎడపల్లి బాబు చూపిన మానవత్వం అందరి హృదయాలను హత్తుకుంది.

## పట్టణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు.

**- రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి .శ్రీధర్ బాబు**
**- ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల కోసం ఎవరికీ రూపాయి ఇవ్వ వద్దు**
**మంథని పట్టణ అభివృద్ధి పనుల కోసం మరో 22 కోట్ల రూపాయలు మంజూరు**
**- ఆర్థిక పరిస్థితులను బాగు చేస్తూ మరో 3 నెలలో నూతన ఫించన్ మంజూరు పై నిర్ణయం**
**- మంథని శివ కిరణ్ గార్డెన్స్ లో లబ్ధిదారులకు**
**ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి శ్రీధర్ బాబు**



మంథని ( ప్రశ్న న్యూస్)పట్టణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంత్రి డి.శ్రీధర్ బాబు మంథని ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శివ కిరణ్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్ లో పాల్గొన్న మంత్రి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,ఉమ్మడి రాష్ట్రంలో పెద్ద ఎత్తున తమ హాయంలో ఇందిరమ్మ ఇండ్లు పేదలకు మంజూరు చేశామని అన్నారు. నేడు మరో 317 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఎల్ 2 లబ్ధిదారులుగా ఎంపికైన 298 దరఖాస్తులు, ఎల్ 3 దరఖాస్తులు పరిశీలించి మరో 300 మంది ఇండ్లు లేని నిరుపేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేసినందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎల్ 1 గా ఎంపికైన ఇందిరమ్మ ఇండ్లు ప్రొసిడింగ్స్ అందుకున్న లబ్ధిదారులకు 4 విడుతలలో 5 లక్షల రూపాయల ప్రభుత్వ సహాయం నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా అందుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల కోసం ఎవరికీ రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఇందిరమ్మ ఇండ్లలో ఎటువంటి అవినీతి ఆస్కారం లేదని, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు చిన్న ఫిర్యాదు అందిన కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆర్డిఓ ను ఆదేశించారు. 317 లబ్ధిదారులు మరో 5 నెలలో ఇండ్లు పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేసుకోవాలని, ప్రభుత్వం ప్రతి వారం నిధులు విడుదల చేస్తుందని అన్నారు. ఇంటి నిర్మాణానికి ఎటువంటి సహాయం అవసరం ఉన్న అధికారులు, స్థానిక నాయకులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి తెలిపారు. మంథని లో ఉన్న పేదలందరికీ విడుతల వారీగా తప్పనిసరిగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారుఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ మరో రెండు మూడు నెలలు నూతన ఫించన్ మంజూరు పై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంథని పట్టణంలో 37 కోట్ల రూపాయలు ఖర్చు చేసి సిసి రోడ్లు, డ్రైయిన్ నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. మంథని పట్టణంలో దాదాపు 10 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ అన్ని వర్గాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. పట్టణంలో పెండింగ్ సీసీ రోడ్లు డ్రైయిన్ల నిర్మాణ పనులకు 22 కోట్ల రూపాయలను నేడు మంజూరు చేశామని, త్వరలో ఈ పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. ఖమంథని ఆర్టీసీ డిపో నుంచి పాత పేట్రోల్ బంక్ వరకు రోడ్డు విస్తరణ వరకు 15 కోట్ల రూపాయలు, సెంట్రల్ లైటింగ్ కొరకు కోటి 20 లక్షల రూపాయలు, అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం వరకు రోడ్డు వెడల్పు పనులకు 50 లక్షల రూపాయలు, బోక్కల వాగు ఇరువైపులా లైటింగ్ కొరకు 30 లక్షల రూపాయలు, శ్రీపాద కాలనీ నుంచి పోచమ్మ గుడి వరకు 22 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంజూరు చేసుకున్నామని తెలిపారు. మనం చేసే అభివృద్ధి సంక్షేమమే ఇతరులకు సమాధానంగా ఉండాలని, రాజకీయంలో వ్యక్తిగతంగా మాట్లాడటం పద్ధతి కాదని మంత్రి హితవు పలికారు. పేద ప్రజలకు శాచురేషన్ పద్ధతిలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరికి నెలకు 6 కిలోల సన్న బియ్యం అందిస్తున్నామని అన్నారు. పేద ప్రజలకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తూ జీరో బిల్ అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు . గత పాలకుల హయాంలో రేషన్ కార్డులో నూతన పేరు చేర్చుకోవడం కూడా చేయలేదని మంత్రి విమర్శించారు. మంథని పట్టణంలోని ఆటో సోదరుల కోసం ప్రత్యేకంగా ఆటోనగర్ ఏర్పాటుకు అవసరమైన భూమి గుర్తించే కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ అధికారి చేపట్టారని త్వరలోనే ఆటోనగర్ ఏర్పాటుకు అనువైన భూమి ఎంపిక చేసి ఇంటి స్థలాలు అందిస్తామని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రోత్సహిస్తూ ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ తప్పనిసరిగా నెరవేరుస్తామని మంత్రి పేర్కొన్నారు.

అంతకు ముందు మంత్రి శ్రీధర్ బాబు మంథని కుచిరాజుపల్లి లో 4.5 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఆర్ ఎండబీ గెస్ట్ హౌస్ నిర్మాణ పనులకు, 20 లక్షల రూపాయలతో నిర్మించనున్న బస్టాండ్, 30 లక్షల రూపాయలతో నిర్మించిన ఈద్గా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మంథని పట్టణం పరిధిలో 8 కోట్ల 5 లక్షల రూపాయల వ్యవధితో చేపట్టిన వివిధ వర్గాలకు చెందిన 28 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఎరుకల గూడెం రోడ్డు నుంచి సి.ఆర్.కే అపార్ట్మెంట్స్ నుంచి అయ్యప్ప టెంపుల్ రోడ్డు వరకు కోటి 89 లక్షల రూపాయలతో చేసిన రోడ్డు నిర్మాణ పనులను , పాత అబ్కారీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్ ను మంత్రి ప్రారంభించారు.

పెంచికల్ పేట్ నుంచి కమాన్ పూర్ రోడ్డు వరకు 14 కోట్లతో చేస్తున్న రోడ్డు విస్తరణ పనులకు, మూడు కోట్ల రూపాయలతో చేపట్టిన గుడదం రాజాపూర్ బ్రిడ్జి నిర్మల పనులకు, 10 లక్షల రూపాయలతో చేపట్టిన గంగాపురి బస్ స్టాండ్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం కల్యాణ లక్ష్మి ,సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను మంత్రి సంబంధిత అధికారులకు పంపిణీ చేశారుఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ , పిడి హౌసింగ్ రాజేశ్వరరావు అయిలి ప్రసాద్ వద్నాల శ్రీనివాస్, తొట్ల తిరుపతి యాదవ్ ప్రజా ప్రతినిధులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్ పెద్ద చెరువులోని గుర్రపు డెక్కను తక్షణం తొలగించాలని: జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి



ఉప్పల్( ప్రశ్న న్యూస్) హబ్సిగూడ డివిజన్లో అన్ని కాలనీలలో విపరీతమైన దోమల బెడద ఉన్నదని ప్రజలు రాత్రిపూట ఈ దోమల బాధ తట్టుకోలేకుండా ఉన్నారని కావున తక్షణం చర్యల్లో భాగంగా అన్ని కాలనీలో దోమల మందు కొట్టేయాలని అదే రకంగా చెత్తాచెదారం లేకుండా పరిశుద్ధ కార్మికులు పనిచేసే విధంగా చూడాలని ఉప్పల్ జిహెచ్ఎంసి ఉప కమిషనర్ గోధుమల రాజు కి ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవికుమార్, తవిడబోయిన గిరిబాబు, ఉప్పల్ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సుర్వి మురళి గౌడ్ , పబోజు నవీన్ చారి, వినతిపత్రాన్ని సమర్పించారు.

## ప్రారంభమైన శ్రీశ్రీశ్రీ క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి జాతర



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధి ఘనాపూర్ లోని శ్రీశ్రీశ్రీ క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి వారి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ జాతర ఉత్సవాలు ఈనెల 16 వరకు జరగనున్నాయి. మొదటి రోజు ఉదయం గంటల నుండి సుప్రభాత సేవతో జాతరను ప్రారంభించారు. ఉదయం 7 గంటలకు విఘ్నేశ్వర పూజ ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ఆలయ అనువంశిక ధర్మకర్తలచే స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. ఇందులో పెద్ద ఎత్తున భక్తుల తో పాటు దేవస్థాన అనువంశిక చైర్మన్లు బాకరాజు వెంకట రామారావు, బాకరాజు దివాకర్ లు పాల్గొన్నారు. ఈనెల 16 వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది. 16న కనుమ పండుగ జాతర ప్రారంభమవుతుందని, ఆరోజున విశేష పూజలు మొక్కుబడి సేవలు సామూహిక అర్చనలు విశేష పుష్పాలంకరణ వంటి కార్యక్రమాలను అతి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

## నూతనకల్ లోస్వామి వివేకానంద జయంతి వేడుకలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్, పరిధిలోని నూతన్ కల్ వార్డు లో, స్వామి వివేకానంద 163, జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువత స్వామి వివేకానంద స్ఫూర్తి తో ముందుకు సాగాలని వివిధ పార్టీల నేతలుసూచించారు,ఈ కార్యక్రమం వివేకానంద విగ్రహ కమిటీ అధ్యక్షులు రమేష్ గుప్తా, అధ్యక్షతన జరిగింది, ఈ కార్యక్రమంలో డబిల్ పూర్ సొసైటీ మాజీ చైర్మన్ సురేష్ రెడ్డి నాయకులు,అశోక్ గౌడ్ ఎర్రోళ్ల బాల నర్సింహా యూనూస్ పాషా,షహీన్ పాషా, జీవన్, ప్రభాకర్ రెడ్డి,వేణు గౌడ్, విజయ్ గౌడ్,మరియు యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## యువతే దేశ భవిష్యత్ - వివేకానంద ఆశయాలతో ముందుకు సాగాలి

**- యువ ఫౌండేషన్ అధ్యక్షులు, అనంతపల్లి గ్రామ ఉప సర్పంచ్ : గొడిశెల తిరుపతి గౌడ్**

**- యువతలో చైతన్యం రగిలించిన తిరుపతి గౌడ్ సందేశం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువతకు గొడిశెల తిరుపతి గౌడ్ సందేశం రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, అనంతపల్లి గ్రామ ఉప సర్పంచ్,యువ ఫౌండేషన్ అధ్యక్షులు గొడిశెల తిరుపతి గౌడ్ జాతీయ యువజన దినోత్సవం,స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువతకు సోమవారం సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు ఆదర్శప్రాయమైన మహానుభావుడని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ విద్య, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగితే దేశానికి గొప్ప సేవ చేసిన వారవుతారని అన్నారు. యువత చదువు, క్రీడలు, సామాజిక సేవలలో చురుగ్గా పాల్గొంటూ తమలోని ప్రతిభను వెలికితీయాలని పిలుపునిచ్చారు.మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకొని, గ్రామం--సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి యువకుడు స్వామి వివేకానంద ఆశయాలను గుండెల్లో పెట్టుకొని దేశ నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## సమాజ సేవే యువత లక్ష్యం కావాలి

**- మల్కాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు : కోరెపు నరేష్**

**- జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు నరేష్ స్ఫూర్తిదాయక సందేశం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం మల్కాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కోరెపు నరేష్ జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం యువతకు స్ఫూర్తిదాయక సందేశం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వామి వివేకానందుడి బోధనలు యువతకు జీవన మార్గదర్శకాలని పేర్కొన్నారు. యువత విద్య, క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో ముందుకు సాగితేనే దేశ భవిష్యత్తు బలంగా మారుతుందని అన్నారు.నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, సమాజ సేవతో పాటు దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. రాజకీయ, సామాజిక రంగాల్లో యువత క్రియాశీలకంగా పాల్గొంటే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.గ్రామీణ ప్రాంత యువత చదువు, ఉపాధిపై దృష్టి పెట్టి తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచిస్తూ, ప్రతి యువకుడు తన కుటుంబానికి, గ్రామానికి గర్వకారణంగా నిలవాలని కోరారు.

# ఆర్.ఎం.పి, పి.ఎం.పిలతో పాటు పరంపర ఆయుర్వేద వైద్యులనూ గుర్తించి, శిక్షణ ఇవ్వాలి

**ప్రభుత్వానికి ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం విన్నపం**



తెలుగు రాష్ట్రాల్లో ఆర్.ఎం.పి (=ఫ్రీ) పి.ఎం.పి (గ్రాఫీ)లకు శిక్షణ ఇచ్చి, వారికి అధికారిక గుర్తింపునిచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుందన్న వార్తలపై ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం హర్షం వ్యక్తం చేస్తోంది.

ప్రజా ఆరోగ్యం పట్ల ప్రభుత్వం చూపుతున్న ఈ సానుకూల దృక్పథం అభినందనీయం.

ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సింహాచలం లక్ష్మణస్వామి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ఆరోగ్య మంత్రిత్వ శాఖకు ఒక ముఖ్యమైన విన్నపం చేశారు. దశాబ్దాలుగా ప్రకృతి సిద్ధమైన మూలికలతో, పరంపరాగతంగా వైద్యం అందిస్తున్న ఆయుర్వేద పరంపర వైద్యులను కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని ఆయన కోరారు.

**ప్రకటనలోని ముఖ్యాంశాలు..**

- గుర్తింపు మరియు శిక్షణ: ఆర్.ఎం.పి, పి.ఎం.పి మిత్రులతో పాటు పరంపర వైద్యులను కూడా కనీసం 'ప్రాథమిక వైద్యులు'గా గుర్తించి, వారికి అవసరమైన శిక్షణ అందించాలి.
- ప్రభుత్వంతో సహకారం: గుర్తింపు లభిస్తే, ప్రభుత్వ ఆరోగ్య పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, అభివృద్ధి పనుల్లోనూ క్రమశిక్షణతో కూడిన జాతీయ భావాలతో పరంపర వైద్యులు పూర్తి సహకారం అందిస్తారు.
- మానవతా దృక్పథం: తరతరాలుగా వస్తున్న ఈ అద్భుతమైన భారతీయ వైద్య విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
- చర్చలకు ఆహ్వానం: ప్రభుత్వం మా సమస్యలను సావధానంగా విని, మమ్మల్ని చర్చలకు పిలవాలని లేదా మా సమస్యల పరిష్కారానికి సానుకూల ప్రకటన విడుదల చేయాలని వేడుకుంటున్నాము.

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే ప్రతి అడుగులో మేము తోడుంటామని, పరంపర వైద్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం కార్యవర్గం విజ్ఞప్తి చేస్తోంది.

ఇట్లు, సింహాచలం లక్ష్మణస్వామి వ్యవస్థాపక అధ్యక్షులు, ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం.

# ప్రజావాణికి గైర్హాజర్ అయిన అధికారులకి మెమోలు జారీ చేయాలని ఆదేశం

**ప్రజావాణికి అధికారులందరూ విధిగా హాజరు కావాలి**

**స్పష్టం చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావిలతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 84 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. అయితే ప్రజావాణి కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజర్ అయ్యారు. దీనిని గమనించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రజావాణి వినతుల స్వీకరణ పూర్తయిన అనంతరం ఒక్కో శాఖ వారీగా అధికారుల హాజరు జాబితాను పరిశీలించారు. ముందస్తు సమాచారం అందించకుండా పలు శాఖల అధికారులు ప్రజావాణికి గైర్హాజరు కావడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సదరు అధికారులకు షోకాజ్ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఇది మొదటి తప్పుగా భావించి, మెమోలతోనే సరిపెడుతున్నామని, ఇక నుండి గైర్హాజర్ అయ్యే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని అన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. సాధారణ సమయాల్లోనూ అధికారులు తమతమ కార్యస్థానాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా విద్యా, వైద్య రంగాలకు చెందిన అధికారులు, సిబ్బంది సమయపాలనను పాటిస్తూ, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఇటీవలే తాను ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో పలువురు విధుల్లో లేని విషయం గమనించడం జరిగిందన్నారు. ఈ తరహా నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, విధుల పట్ల అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ తేల్చి చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఆయా కార్యాలయాల పనితీరును, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలును నిశితంగా పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రులలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళలో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షణ జరపాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరాముడికి బీజేపీ లో సభ్యత్వం ఉందా.?

**ఎలక్షన్ సమయంలోనే బీజేపీకి దేవుడు గుర్తొస్తాడా.?**

**బిటీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వాఖ్యలు**



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ఎలక్షన్ సమయంలోనే బీజేపీకి దేవుడు గుర్తొస్తాడా అంటూ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సంచలన వాఖ్యలు చేసారు.దేవుళ్ళని వాడుకొని రాజకీయాలు చేయడం ఆపేయాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బీజేపీకిహిత బోధ చేశారు. శ్రీరాముడికి బీజేపీ లో సభ్యత్వం ఉందా అని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ భవన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మేము కూడా హిందువులమే,పూజలు చేస్తాం కానీ సెక్యూలర్లం అని అన్ని మతాలను కలుపుకొని పోతాం అని అన్నారు.కేంద్రంలోని బీజేపీ వల్ల నిరుద్యోగులకు ఉద్యోగాలు రాక పోగాఉన్న ఉద్యోగాలు ఊడే పరిస్థితి ఉందని, 12 ఏళ్ల పాలనలో బీజేపీ ఏం ఒరగబెట్టిందో చెప్పి ఓట్లు అడగాలి అని ఆయన సూచించారు. దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగే వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జిల్లాకు 30 ఏళ్ల ఇంజనీరింగ్ కళాశాల, అగ్రికల్చరల్ కళాశాల, జిల్లాలో దాదాపు రూ.600 కోట్లతో రోడ్లు అభివృద్ధి చేసేదికాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. నిజామాబాద్ లో మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలుచుకున్నామని, మెజార్టీ సర్పంచ్ స్థానాలు గెలుచుకున్న మొదటి ఐదు జిల్లాలో నిజామాబాద్ ఒకటన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో జిల్లాలో మాత్రమే కాకుండా యావత్ రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాంనిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కైవసం చేసుకుంటాం ,పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల వారు వివక్షకు గురయ్యారు.,కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఫామ్ హౌస్ కి పలాయనం చిత్తగించారు,రెండేళ్ల పాలనలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులందరి సహకారంతో రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పయనిస్తోంది ,పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్స్ వలన కొంత మేర నష్టం జరిగింది అన్నారు.,రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పక్కా ప్రణాళికలతో పాత ,కొత్త నేతలను సమన్వయపరిచి మెజార్టీ మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటాం ,నిత్యం ప్రజా క్షేత్రంలో ఉన్నవారికి బిఫాం ఇస్తాం,నిజామాబాద్ మున్సిపాలిటీని మంచి మెజార్టీ తో గెలుచుకుంటాం,ప్రజా పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం చూసి మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారు,దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి,సంక్షేమం,సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో దావోస్ పర్యటన తో లక్ష 75 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి,,గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షలు 70 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,రేషన్ కార్డులు, న భూతో నా భవిష్యత్ అనేలా సన్న బియ్యం పంపిణీ గతంలో బిఆర్ఎస్ హయంలో నిజామాబాద్ కేంద్రంగా బియ్యం స్మగ్లింగ్ విచ్చల విడిగా సాగింది,ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు,,విద్య, వైద్యం,స్పోర్ట్స్ కి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తాము అన్నారు. ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు ఉండే అవకాశం ఉంది, జిల్లాలో 80 శాతం మందికి ఉచిత విద్యుత్ పథకం అందుతుంది అన్నారు. కులం మతం పక్కనబెట్టి పేదవారి జీవిత స్థితిగతులు మారాలి అన్నారు.

# రాజన్న బాటలో మణికంఠ గౌడ్ ఘనంగా చిలుక రాజన్న 64వ జయంతి వేడుకలు

**రాజన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన నేతలు, ప్రజలు**

**తండ్రి జయంతి రోజు శవపేటికలు, కార్మికులకు నగదు ప్రోత్సాహం అందించిన మణికంఠ గౌడ్**





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మాజీ సర్పంచ్ రామన్నగారి చిలుక రాజు 64వ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలోని పెద్ద చెరువు సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంతేకాకుండా సర్పంచ్ గా ఉన్న సమయంలో రామన్న గారి చిలుక రాజు చేసిన సేవలను స్మరించుకున్నారు. కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి అన్ని రకాల సహకారాలు అందిస్తూ రామన్నగారి చిలుకరాజు అందరి మనసులో నిలిచారని గుర్తు చేసుకున్నారు.

**తండ్రి బాటలో తనయుడు రామన్నగారి మణికంఠ గౌడ్ :**

మేడ్చల్ మాజీ సర్పంచ్ రామన్నగారి చిలకరాజును నమ్ముకున్న ప్రజలకు అహర్నిశలు అందుబాటులో ఉండి ఏ కష్టం వచ్చినా నేనున్నా అంటూ ప్రతిక్షణం ప్రజల కోసం పరితపించిన రామన్నగారి చిలకరాజు కుమారుడు రామన్నగారి మణికంఠ గౌడ్ ( మాజీ కౌన్సిలర్) తన తండ్రి బాటలో నడుస్తూ తను నమ్ముకున్న ప్రజల కోసం, వారి శ్రేయస్సు కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనిస్తున్నారు. గతంలో కౌన్సిలర్ గా సేవ చేసినప్పుడు ఓట్లేసి గెలిపించిన ప్రతిక్షణం అన్నా అంటే నేనున్నా అంటూ అందుబాటులో ఉండి ప్రజల మన్ననలను పొందుతున్న రామన్నగారి మణికంఠ గౌడ్ తన తండ్రి చిలుక రాజు జయంతిని పురస్కరించుకుని శవపేటికలను విరాళంగా అందజేశారు. దీంతోపాటు గిర్మాపూర్ వార్డు కార్యాలయంలో పనిచేసే పదిమంది కార్మికుల కష్టాన్ని గుర్తించి ఒక్కొక్క కార్మికునికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హనుమంత్ రెడ్డి, బాల్ రెడ్డి, మాజీ బీజేపీ అధ్యక్షులు ఆంజనేయులు, రాఘవరెడ్డి, సత్యనారాయణ, రాజిరెడ్డి, మామిండ్ల వేణు, చీర్ల రాము, శేఖర్, వెంకటేశ్, ప్రభు, చంద్ర శేఖర్, శ్రీపాల్, జావిద్, అర్జున్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో

# డ్రైవర్లకు అవగాహన



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల పట్టణంలో సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ ఆదేశాల మేరకు ప్యాసింజర్, సరుకు రవాణా వాహనాల డ్రైవర్లు, ఆటో రిక్షా డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మద్యపానం చేసి వాహనాలు నడపరాదని, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని, ప్రయాణికుల ప్రాణ భద్రత కోసం ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారి, సిబ్బంది సౌమ్య,రమ్య, ప్రశాంత్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు పార్క్ సెంటర్ లో సంక్రాంతి సంబరాలు



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) మహిళకు ముగ్గుల పోటీలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు. పార్క్ ఫ్రెండ్స్ అసోసియేషన్, మిత్రల ఆధ్వర్యంలో రేపు మంగళవారం పట్టణంలోని 13 వ సచివాలయం పార్క్ వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటలకు వరకు జరిగే కార్యక్రమం విఘ్నేశ్వర పూజ, మహిళలు పొంగళ్ళతో కార్యక్రమం ప్రారంభమై ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. కావున ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. యెల్లినేడి వెంకటేశ్వర్లు (బీడీఆర్), సీనియర్ న్యాయవాది చలువాది చిన్న సత్యనారాయణ, రాజవరపు శివ నాగేశ్వరావు, కౌన్సిలర్ బండి మల్లిఖార్జున రెడ్డి నాయకులు గన్నమనేని శ్రీనివాసరావు, గద్దె మురహరిరావు, వెంకట్రావ్, పెరుమాళ్ళ లక్ష్మినారాయణ, లింగంశెట్టి సుబ్బారావు, మోటమర్రి రాంబాబు, త్రిపురమల్లు రవి, యెల్లినేడి రామారావు

## అలాంటి గొప్ప వ్యక్తి మన భారతదేశంలో పుట్టడం మనకు గర్వకారణం

**- ధర్పల్లి సర్పంచ్ చలిమెల శ్రీనివాస్**



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని నూతనంగా ఎన్నిక అయిన గ్రామపంచాయతీ పాలకవర్గం వివేకనంద విగ్రహానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సర్పంచ్ చలిమెల శ్రీనివాస్ మాట్లాడుతూ యువతకు ఆదర్శం అయిన వివేకానంద మార్గాన్ని ఎంచుకొని ఆయన బాటలో నడవాలని కోరారు హిందూ ధర్మం, సనాతన ధర్మ రక్షకుడిగా పేరొందిన వివేకానందుడు అమెరికా చికాగోలో జరుగుతున్న సభకు భారత ప్రతినిధిగా సభలో పాల్గొన్నారు. సభ అయిపోయే సమయంలో భారత్ కు అవకాశం ఇవ్వగా ఆయన మాట్లాడుతూ మొదటగా బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా అనగానే మూడు నిమిషాల పాటు చప్పట్లు మారుమోగిపోయాయి ఆయనకు ఇచ్చిన తక్కువ సమయం అయినా ఎంతసేపు మాట్లాడినా అక్కడ ఉన్న సభ్యులు చిమ చిటుక్కుమనే సౌండ్ కూడా వినిపించేలాగా ఎక్కడి వారు అక్కడే కూర్చుండిపోయారు అలాంటి గొప్ప వ్యక్తి మన భారత దేశంలో పుట్టడం మనకు గర్వకారణం ఆయనను మనం మార్గదర్శకంగా తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎజ్జ శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్రాజ్, సొసైటీ మాజీ చైర్మన్ చిన్నారెడ్డి, చెలిమెల అజయ్,ప్రశాంత్, అబ్దుల్ హమీద్, మజీద్, చక్రపాణి, ప్రవీణ్, సనుగుల వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## సరదాగా భావతరంగిణి సంక్రాంతి సందడి

భావతరంగిణి ఆధ్వర్యంలో స్థానిక మహతి కళావేదికలో ఆదివారం సాయంత్రం జరిగిన సంక్రాంతి సందడి సరదాగా సాగింది. లలిత, సినీ, జానపద గీతాలు, కూచిపూడి నాట్యాలు, హాస్య స్కిట్స్ , వదిన బిమరదళ్ల హాస్య సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి రావినూతల సత్యనారాయణ అలనాటి మేటి సినీ గీతాలు ఆలపించగా, అల్లాడ శ్యామలత భోగి ,గొబ్బెమ్మల పాటలు ఆలపించారు. పాటలకు అనుగుణంగా కొంతమంది మహిళలు నృత్యాలు చేశారు. తుమ్మల షనయ సిరి, మేధశ్రీ లు రాధాకృష్ణుల నృత్యంచేయగా ,దేవిశ్రీ ప్రియ కూచిపూడి నాట్యం చేశారు అనంతరం భవిష్య రచించి దర్శకత్వం వహించిన హాస్య స్కిట్స్ "జలుబు వదలాలంటే , ఫోటోల పెళ్లిళ్లు,అడ్రస్ గందరగోళం, బ్యాంక్ చెక్, డాక్టర్ తెలివి " మొదలైన హాస్య స్కిట్స్ ను ఔత్సాహిక కళాకారులు రావినూతల వెంకటేశ్వరరావు ,కోసూరు ఈశ్వరరావు, ఆర్.ఎస్ .నారాయణ, వై .శ్రీరామ్, శ్రీమతి పి.శాంతి బాల నటుడు చి: కృష్ణ కౌండిన్య దత్ లు అభినయించారు . వదిన మరదలు హాస్య సంభాషణలో హైదరాబాదుకు చెందిన చిలుకూరి నవ్య శ్రీ గాయత్రి,జమ్మలమడక బిందు దత్త శ్రీ లు సరదా సరదా మాటలతో అందరినీ నవ్వించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి డిపో మేనేజర్ టి. పెద్దిరాజు , ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ త్యాగరాజ విద్యాపీఠం అధ్యక్షులు బిహెచ్విఎల్ రాధాకృష్ణమూర్తి భావ తరంగిణి గౌరవఅధ్యక్షుడు కనీచనపల్లి కృష్ణమోహన్ రావు ,భావ తరంగిణి అధ్యక్షులు భవిష్య, రోటరీ వెంకటేశ్వర్లుకళాకారులను అభినందించి జ్ఞాపకాలు బహుకరించారు

# మహిళలు ముందంజలో - మౌన విప్లవ కారిణులు

భారతదేశ ప్రజాస్వామ్యంలో సంప్రదాయం మరియు ఆధునికత ఒకే వేదికపై కలుస్తున్న ఈ కాలంలో, ముస్లిం మహిళలు మౌన విప్లవ కారిణులుగా అవతరిస్తున్నారు. చాలా కాలం వరకు అణచివేత, మూస ధారణలు, మరియు సామాజిక అవరోధాల నీడలలో ఉన్న ఈ మహిళలు, ఇప్పుడు తమ ప్రతిభ, పట్టుదలతో దేశానికి కొత్త దిశ చూపుతున్నారు.

వారు తరగతి గదుల నుండి పార్లమెంట్ వరకు, క్రీడా మైదానాల నుండి వ్యాపార రంగాల వరకు తమ సత్తా చాటుతూ, భారతదేశ మహిళా సాధికారత చరిత్రలో కొత్త అధ్యాయాన్ని రాస్తున్నారు.

### విద్య - మార్పుకు మార్గం

విద్య ముస్లిం మహిళల జీవితంలో విప్లవాత్మక మార్పును తెచ్చింది. నజ్మా అఖ్తర్ గారు విద్య మరియు సామాజిక రంగాల్లో చేసిన సేవలకు గాను పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. అలాగే, నైమా అఖ్తర్ అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి వైస్ చాన్స్లర్‌గా నియమితులై, మహిళా నాయకత్వానికి నూతన చరిత్ర సృష్టించారు. AISHE నివేదిక ప్రకారం, గత కొన్నేళ్లలో ముస్లిం మహిళల ఉన్నత విద్యలో 50 శాతం పెరుగుదల నమోదైంది.ముంబై ధారావి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కుమార్తె అదీబా అనమ్ కథ ఈ మార్పుకు ప్రతీక. కష్టాల మధ్య చదువుకుని, 2024లో సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణురాలై, మహారాష్ట్ర తొలి ముస్లిం మహిళ ×ూూ అధికారిణిగా నిలిచింది. ఇప్పుడు ఆమె జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ, ఇస్లామిక్ స్టడీస్తో పాటు సైన్స్ మరియు టెక్నాలజీ అంశాలను మద్రసా విద్యలో చేర్చే సంస్కరణలకు ముందుండి నడుస్తోంది.

### క్రీడ - ధైర్యానికి ప్రతీక

ముస్లిం మహిళలు క్రీడా రంగంలోనూ అడ్డంకులను అధిగమిస్తున్నారు. తెలంగాణకు చెందిన నిఖత్ జరీన్ రెండు సార్లు ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌గా నిలిచి, దేశ గర్వకారణమైంది.

ఆమె విజయం కేవలం బాక్సింగ్ రింగులో కాదు – సామాజిక ధారణలపై కూడా ఒక పంచ్ లాంటిది. ఉపవాసంలో ఉన్నప్పటికీ రింగ్‌లోకి అడుగుపెట్టిన ఆమె దృఢసంకల్పం విశ్వాసం మరియు క్రీడా స్ఫూర్తి కలయికగా మారింది.

కశ్మీర్‌కు చెందిన అన్సా మరియు అయీరా చిష్టీ సోదరీమణులు వూషూ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించి, సంఘర్షణ ప్రాంతాల నుండి వచ్చిన అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచారు. వారి విజయాల తర్వాత కశ్మీర్ ప్రభుత్వం గ్రామీణ బాలికల కోసం ప్రత్యేక వూషూ శిక్షణా శిబిరాలు ప్రారంభించింది.

### వ్యాపారం -ఆర్థిక స్వాతంత్ర్య పథం

విద్య మరియు క్రీడలతో పాటు వ్యాపార రంగంలో కూడా ముస్లిం మహిళలు ముందంజలో ఉన్నారు. రూహ్ షదాబ్ స్థాపించిన ాావసదీఎ ఖీశీబఅఞ్ఱశీఅ ద్వారా 500కి పైగా ముస్లిం మహిళలు నాయకత్వ మరియు వ్యాపార నైపుణ్యాలు సాధించారు.ఆమెకు 2024లో Skoll Award for Innovation లభించింది. ఆమె మాటల్లో – "నమ్మకం అడ్డంకి కాదు, అది నా దిశానిర్దేశం."

అలాగే, ముంబైకి చెందిన ఐషా టాబ్రేజ్ చినోయ్ తన S.A Foods సంస్థ ద్వారా భారతీయ రుచులను దేశమంతా విస్తరించింది. సాధారణ మత్స్యకార కుటుంబానికి చెందిన ఆమె, స్వంతంగా వ్యాపారం ప్రారంభించి దేశవ్యాప్తంగా మార్కెట్‌లో గుర్తింపు పొందింది.

ముస్లిం మహిళల ఈ విజయాలు వ్యక్తిగత పరిమితులను దాటి, సామాజిక మార్పు వైపు పయనిస్తున్నాయి. మీడియా, విధాన రూపకర్తలు, ప్రభుత్వాలు ఈ కథల ద్వారా ప్రేరణ పొంది, హిజాబ్ ఫ్రెండ్లీ క్రీడా దుస్తులు, మహిళా స్టార్టప్ ప్రోత్సాహ పథకాలు, అల్పసంఖ్యాక విద్యార్థుల నిధులు వంటి కొత్త కార్యక్రమాలను ముందుకు తెస్తున్నాయి.

**వారి పట్టుదల, ఆత్మవిశ్వాసం భారతదేశానికి ఒక కొత్త అర్థం నేర్పుతోంది**

**వారు తిరుగుబాటు చేయడం కాదు, వారు నిర్వచనాన్నే మార్చుతున్నారు**

# గురువులకు సన్మానాలు.. విద్యార్థులకు ఆనందాలు

**పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో వెల్లివిరిసిన ఆనందాలు**

**తమ గురువులను చూసుకుంటూ ఆనందించిన శిష్యులు**

**శిష్యులను చూసి ఆశీర్వదించిన గురువులు**

**మల్కాజిగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో పండగ వాతావరణం**



మల్కాజిగిరి(ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాలలో వివిధ సంవత్సరాల్లో చదువుకున్న వేలాది మంది పూర్వ విద్యార్థులు హాజరై పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, ఎన్ సి సి సార్గా, అలాగే ప్రధానోపాధ్యాయుడిగా సుమారు 30 సంవత్సరాల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన హనుమయ్య సార్ పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. విద్యార్థుల జీవితాలను మలిచిన గురువుగా హనుమయ్య సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా అందరూ కొనియాడారు. హనుమయ్య సార్ మల్కాజిగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో 30 ఏళ్ల పాటు తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి విలువలను నేర్పించారు. అనంతరం స్కూల్ ప్రధానోపాధ్యాయుడీగా బాధ్యతలు నిర్వర్తించి పాఠశాల అభివృద్ధికి కీలక పాత్ర పోషించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన హనుమయ్య సారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రత్యేకీ అభినందనలు తెలియజేశారు. గురువు నుంచి ప్రజాప్రతినిధిగా ఎదిగిన ఆయన ప్రయాణం అందరికీ



స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి 1957 సంవత్సరం నుంచి 2025 సంవత్సరం వరకు మల్కాజిగిరి జిల్లా పరిషత్

**జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల**

పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో



హాజరయ్యారు. పాఠశాలలో పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ విద్యార్థులతో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక్కచోట చేరడంతో పాఠశాల ప్రాంగణం భావోద్వేగ వాతావరణంతో నిండిపోయింది. గురు–శిష్యుల అనుబంధానికి నిదర్శనంగా నిలిచిన ఈ సమ్మేళనం అందరిలో చిరస్మరణీయంగా మిగిలిందని పాల్గొన్నవారు తెలిపారు. శ్రీహరి అనే 1992 బ్యాచ్ చెందిన విద్యార్థి చెతో గీసిన హనుమయ్య సార్ చిత్రపటాని బహుకరించారు. వారితో పాటు తోటి విద్యార్థులు, రాముయాదవ్, లక్ష్మన్ యాదవ్, అశకోక్, నర్సింగ్ రావు, అనంతకృష్ణ, రాంప్రసాద్, మధుసూదన్, వెంకటేష్ టి ఎల్ వి ప్రసాద్, రితిష్, తదితరులు పాల్గొనడం గరిగింది.



# చివరి దశకు కల్తీ నెయ్యి కేసు

**తిరుమల,** తిరుమల లడ్డూ వివాదానికి సంబంధించిన కేసు విచారణ తుది దశకు చేరుకుంది. సిబిఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేపడుతున్న సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా తిరుపతిని కేంద్రంగా చేసుకొని ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతోంది. దీనిని సిబిఐ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కేసు విచారణ ఒక కొలిక్కి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడికి కోర్టు బెయిల్ నిరాకరించడం.. తుది దశకు చేరుకున్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం సంకేతాలు పంపించింది. అయితే ఈ కేసు విచారణలో భాగంగా సంచలనాలు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తిరుమల లడ్డు తయారీలో వాడే నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందన్న ఆరోపణలు వచ్చాయి. అయితే జంతు కొవ్వుకు సంబంధించిన అంశం బయటకు రాలేదు కానీ.. నెయ్యి మాత్రం కల్తీ అయిందని స్పష్టమైన ఆధారాలు దొరికాయి. అయితే ఈ కేసు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీగా డ్యామేజ్ చేసింది.వైసీపీ హయాంలో టీటీడీ ప్రతిష్టకు మంటగలిపే చాలా రకాల చర్యలు జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. అన్యమత ప్రచారం తో పాటు టీటీడీలో చాలా రకాల అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఇటువంటి నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు వైసీపీ హయాంలో జరిగిన వ్యవహారం పై మాట్లాడారు. తిరుమల లడ్డు తయారీకి సంబంధించిన నెయ్యిలో జంతు కొవ్వు వాడారని ఆరోపణలు చేశారు. అప్పట్లో ప్రకంపనలకు దారితీసాయి ఆ వ్యాఖ్యలు. అయితే ఈ ఆరోపణలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అలర్ట్ అయింది. ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. కానీ సిబిఐ నేతృత్వంలోని దర్యాప్తు కావాలని వైసిపి కోరింది. దీంతో కోర్టు సిబిఐ నేతృత్వంలోని కేంద్ర రాష్ట్ర



ప్రభుత్వాధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. గత కొన్ని నెలలుగా సిట్ విచారణ చేపడుతోంది. అయితే ఇది తుది దశకు విచారణ వచ్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో టిటిడిలో పనిచేసిన ఓ అధికారి నెయ్యి సరఫరా చేసిన సంస్థల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. అయితే దాదాపు 80 లక్షల రూపాయలకు పైగా లావాదేవీలకు సంబంధించి ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అప్పన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. తెర వెనుక పెద్ద వ్యక్తుల ప్రమేయాన్ని కూడా గుర్తించినట్లు సమాచారం

. మరోవైపు సిబిఐ ఉన్నతాధికారులు ఢిల్లీ నుంచి తరచూ వస్తున్నారు. ఇంకోవైపు కోర్టు ప్రధాన నిందితుడికి సంబంధించి బెయిల్ తిరస్కరించింది. ఇటువంటి పరిస్థితుల్లో కేసు విచారణ తుది దశకు చేరినట్లు స్పష్టమవుతోంది. అయితే ఈ కేసులో సంచలనాలు నమోదయ్యే ఛాన్స్ ఉందని అధికార వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.

# సర్పంచ్ గోవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ గోదాదేవి కళ్యాణ వేడుకలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, మాన్వాడ గ్రామంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి కళ్యాణం వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కట్ట గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్చారణలతో కళ్యాణాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఐరెడ్డి గీత - మల్లారెడ్డి, చంద్రశేఖర్ రావు,ఐరెడ్డి రాజిరెడ్డి,లచ్చయ్యతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



నాచారం(ప్రశ్న న్యూస్) జాతీయ యువజన దినోత్సవాన్ని నాచారం లో ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఎస్ ఎస్ ఎస్ యువసేన మరియు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ యువతకు మార్గ నిర్దేశం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన బోధనలను స్ఫూర్తిగా తీసుకొని నవ భారత నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. వివేకానందుని ఆశయాలను ప్రతి ఒక్కరు నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి, కృష్ణారెడ్డి, నందికొండ శ్రీనివాసరెడ్డి, మహేష్ యాదవ్, వి.ఎస్ ప్రకాష్ రెడ్డి, క్రాంతి కిషోర్, సుంకసారి వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి





శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలోని మార్కెట్ యార్డ్ నందు సంక్రాంతి సంబరాలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు, ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి వారి తల్లి బొజ్జల బృందమ్మ. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు భోగిమంటల వెలుగులలో గొబ్బియాలు ఆడుతూ మహిళలు ఆటపాటలతో సరదాగా సంక్రాంతి వేడుకలను నిర్వహించుకున్నారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వారి సతీమణి బొజ్జల రిషితారెడ్డి బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రజలకు సంక్రాంతి, భోగి, కనుమ, శుభాకాంక్షలు తెలియజేశారు. భావితరాలకు పండుగ ప్రాముఖ్యతను తెలిపే విధంగా ప్రతి ఒక్కరు వారి వారి పిల్లలకు పండుగ యొక్క ప్రత్యేకతను తెలియజేస్తూ ,సాంప్రదాయ దుస్తులు పిల్లలు ఉపయోగించే విధంగా పిల్లల్లో మార్పులు తీసుకురావాలని, ప్రతి ఒక్కరు పండుగ ప్రాముఖ్యతను తెలుసుకొని వాటిని ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సందర్భంగా ఆయన కోరారు.

# ఘనంగా స్వామి వివేకానంద స్వామి జయంతి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తిలో స్వామి వివేకానంద జయంతిని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం స్కౌట్స్ మాస్టర్ ఎస్ కె. అజారుద్దీన్ మాట్లాడుతూ వివేకానంద ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని నడుచుకోవాలని, ప్రతి ఒక్కరూ సామాజిక సేవల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేష్, ధనుష్, ఏపీజే అబ్దుల్ కలాం స్కౌట్ ట్రూప్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చలికి ట్యాంక్ లోని నీరు చల్లగా ఉన్నాయా...

## కొన్ని ఫాలో అయితే వేడిగా మార్చుకోవొచ్చు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రోజులు పెరిగేకొద్దీ చలి పెరుగుతోంది. ఈ టైమ్లో ఎంత జాగ్రత్తగా ఉన్నా చలి చంపుతోంది. ఇక నీటిని ఒంటిపై వేసుకుంటే చాలు వణుకొస్తుంది.

ట్యాంక్లో నుంచి వచ్చే నీరు నేరుగా ఫ్రిజ్ నీటిలా మారి వెన్నులో వణుకు పుట్టిస్తోంది. సాధారణంగా స్నానానికి వేడి నీరు పెట్టుకుంటాం. కానీ, కాళ్ళు చేతులు కడగడానికి కూడా వాడే నీటిని కూడా వేడి చేయలేం. అలాంటప్పుడు ఏ టిప్స్ ఫాలో అయితే ట్యాంక్లోని నీరు సహజంగానే వేడిగాఎలా మారుతుందో తెలుసుకుందాం పెరిగిన చలికి కాళ్ళు, చేతులు తిమ్మిర్లొస్తున్నాయి. బోర్ నుంచి వచ్చే నీరు ముందుగా కాస్త చల్లగా వచ్చినా తర్వాత వేడిగా వస్తాయి. కానీ, ప్రతీసారి బోర్ వాడలేం. అందుకే, ఒకేసారి ట్యాంక్లో పట్టేసి ఉంచుకుంటాం. అయితే, ఇది తగ్గిన ఉష్ణోగ్రతల కారణంగా త్వరగానే చల్లగా మారుతుంది. దీంతో ప్రతీసారి వాడే నీరు చల్లగానే ఉండడంతో కాళ్ళు, చేతులు తిమ్మిరి పట్టి ఇబ్బందిగా అనిపిస్తుంది. అలాంటప్పుడు ప్రతీసారి నీటిని వేడి చేయలేం. అలా కాకుండా సహజంగానే ట్యాంక్లోని నీటిని ఎలా వేడి చేయాలో ఇప్పుడు చూద్దాం.

### ట్యాంక్ని కవర్ చేయడం

చలికాలంలో ట్యాంక్ని వెచ్చగా ఉంచాలంటే మీరు ట్యాంక్ని



జనపనార లేదా మందపాటి క్లాత్తో కవర్ చేయాలి. దీంతో చల్లని గాలి ప్రత్యక్షంగా తగలదు. దీంతో నీరు చల్లగా మారదు. ఇది చాలా ఎఫెక్టివ్గా ఉంటుంది. నీరు వెచ్చగా ఉంచడంలో ఇది హెల్ప్

నీటిని గోరువెచ్చగా మార్చడానికి కూడా థర్మాకోల్ షీట్ని వాడొచ్చు. దీంతో అవి ఇన్సులేటర్లా పనిచేస్తాయి. బయటి చలి ట్యాంక్ వెళ్లకుండా ఉంటాయి. దీంతో నీరు వెచ్చగానే ఉంటుంది. ఇలాంటి నీటితో మనం ఫేష్ వాష్ కూడా చేసుకోవచ్చు.

### పెయింట్ చేయడం

నీటిని వెచ్చగా ఉంచేందుకు ట్యాంక్ పై కప్పుకి రంగు వేయండి. బ్లాక్, బ్లూ, గోధుమ రంగు వంటి ముదురు రంగులతో పెయింట్ వేస్తే ఇవి సూర్యుని నుంచి వచ్చే వేడిని గ్రహించి ట్యాంక్ని వెచ్చగా ఉంచుతాయి. నీరు చల్లగా మారకుండా హెల్ప్ చేస్తుంది.



### సోలార్ వాటర్ హీటర్

అదే విధంగా, సోలార్ వాటర్ హీటర్ ఉంటే దానిని కూడా వాడొచ్చు. దీని వల్ల కూడా నీరు వేడిగా ఉంటుంది. రోజువారీ అవసరాలకి నీరు వెచ్చగా ఉంటుంది. చక్కగా వాడుకోవచ్చు. కావాలనుకుంటే వీటితో స్నానం కూడా చేయొచ్చు. ఇది సహజంగానే వేడి అయ్యే నీరు. ఎప్పటికప్పుడు వాడుకోవడం అదే విధంగా, నీటిని ఒకేసారి నింపి పెట్టుకోకుండా వీలైనంతవరకూ ఎప్పటికప్పుడు నింపి పెట్టుకోండి. దీని వల్ల కూడా నీరు వెచ్చగానే ఉంటుంది. మధ్యాహ్నం పూట పట్టుకోకపోయినా, ఉదయం, సాయంత్రం వాతావరణం మరీ చల్లగా ఉంటుంది. కాబట్టి, ఆ టైమ్లో పెట్టుకోండి. దీంతో మరీ చల్లగా మారకుండా ఉంటుంది.

# మేడారం మహా జాతర..

# గద్దెలపైకి అమ్మల ఆగమనం

ములుగు (ప్రశ్న న్యూస్) మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ముహూర్తం ఖరారైంది. జనవరి 28 నుంచి 31 వరకు జరిగే ఈ మహా కుంభమేళాకు ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవార్ల గద్దెల పునరుద్ధరణతో పాటు, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. లక్షలాది మంది భక్తులు 'నిలువెత్తు బంగారం'తో మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈసారి జాతర భక్తులకు మధుర స్మృతిగా నిలిచిపోనుంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ముహూర్తం ఖరారైంది. అశేష జనవాహిని ఎదురుచూస్తున్న ఈ వనదేవతల పండుగ జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనుంది. కోట్లాది మంది భక్తుల కొంగుబంగారమైన సమ్మక్క-సారలమ్మల దర్శనానికి ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. మహా జాతరకు ముందుగా.. జనవరి 19న అమ్మవారి గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం అట్టహాసంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలువురు మంత్రులు హాజరుకానున్నారు. జాతరలో ప్రధాన ఘట్టాలు జనవరి 28న కన్నెపల్లి నుంచి సారలమ్మ దేవత గద్దెకు ఆగమనం. జనవరి 29న చిలకలగుట్ట నుంచి సమ్మక్క దేవత గద్దెకు చేరుకోవడం. జాతరలో అత్యంత కీలక ఘట్టం.జనవరి 30న భక్తుల మొక్కుల సమర్పణ. లక్షలాది మంది



భక్తులు అమ్మవార్లను దర్శించుకుని 'నిలువెత్తు బంగారం' (బెల్లం) సమర్పించుకుంటారు. జనవరి 31: సాయంత్రం 4 గంటలకు అమ్మవార్లు తిరిగి వన ప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది. మేడారంలో ముందస్తు కోలాహలం..

జాతర సమీపిస్తుండటంతో మేడారం ఇప్పటికే భక్తుల రద్దీతో మినీ జాతరను తలపిస్తోంది. ఆదివారం సెలవు దినం కావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్రల నుంచి సుమారు 2 లక్షల మంది భక్తులు తరలివచ్చారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, జంపన్న, నాగులమ్మకు ముడుపులు కట్టి తమ భక్తిని చాటుకున్నారు. గద్దెల వద్ద పసుపు, కుంకుమ, సారె సమర్పించి



మొక్కులు తీర్చుకున్నారు. ములుగు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జాతర పనులు శరవేగంగా సాగుతున్నాయి. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా సౌకర్యాలలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

ఎమర్జెన్సీ రెస్పాన్స్ కోసం అంబులెన్సు, నిరంతర విద్యుత్ సరఫరా, భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. వాహనాల రద్దీని నియంత్రించేందుకు పార్కింగ్ స్థలాలను విస్తరించారు. వనదేవతల ఆశీస్సుల కోసం తరలివచ్చే కోట్లాది మంది భక్తులకు ఈసారి జాతల ఒక మధుర స్మృతిగా మిగిలిపోయేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

మేడ్చల్( ప్రశ్న న్యూస్) గ్రేటర్ మున్సిపల్ హైదరాబాద్ మేడ్చల్ కార్పొరేషన్ లో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందకు పూలమాలు వేసి జయంతిని మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చీర్ల రమేష్, మాజీ కౌన్సిలర్ మల్లేష్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, కౌన్సిలర్ మధుకర్ యాదవ్ కౌడి మహేష్ మహేష్ మధుకర్ యాదవ్ శివ కుమార్ యాదవ్ రవీందర్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి రామస్వామి టైలర్ రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా పిజెఆర్ జయంతి వేడుకలు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ మేడ్చల్ కార్పొరేషన్ ఈరోజు పి జె ఆర్ జయంతిని సందర్భంగా పిజేఆర్ చిత్రపటానికి



పూలమాలలు వేసి ఘనంగా జయంతిని జరుపుకున్నారు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, పంజాగారి ఆంజనేయులు మాజీ వైస్ చైర్మన్ రమేష్ మాజీ కౌన్సిలర్ మల్లేష్



గౌడ్ రాఘవేందర్ గౌడ్ రవీందర్ రెడ్డి, మహేష్ కురుమ మధుకర్ యాదవ్ శివకుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్ రెడ్డి రామస్వామి టైలర్ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# బిజెపి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

## ఆకట్టుకున్న రంగవల్లులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) సంక్రాంతి పండగ సంబరాలు లో భాగంగా మేడ్చల్ జిల్లా పూడూర్- కిష్టాపూర్ డివిజన్ లో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల కు విశేష స్పందన లభించింది. పూడూర్- కిష్టాపూర్ డివిజన్ లో ముగ్గుల పోటీలను మేడ్చల్ బీజేపీ సీనియర్ నాయకుడు రామ్మన్న గారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుత సక్రాంతి పండగ సందర్భంగా పూడూర్ కు చెందిన మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు సమాజంలో ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మార్పు రావాలని కోరుతూ మంచి కార్యక్రమాలు సూచిస్తూ ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న అందరికీ అభినందనలు తెలుపుతూ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్,సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్,




బచ్చు కృష్ణ ప్రియ, పద్మాక్షి, వంశీధర్ రెడ్డి, అవినాష్ చారి, జాకట బాబు రాజు, కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో తీవ్రమవుతున్న పొల్యూషన్

## -రోగాలకు కారణమవుతున్న వాయు కాలుష్యం

- హైదరాబాద్‌లో రోజురోజుకు భారీగా పెరుగుతున్న వాయు కాలుష్యం
- తీవ్రంగా పడిపోతున్న గాలి నాణ్యత
- చలి తీవ్రతతో సమస్య మరింత జఠిలం
- ఈ ఏడాది మొదటిరోజు నుంచే పెరిగిన వాయు కాలుష్యం
- పడకేసిన కాలుష్య నియంత్రణ మండలి కార్యకలాపాలు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజలకు రోగాల ముప్పు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అతివేగంగా వాయు కాలుష్యం పెరుగుతుండడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ముఖ్యంగా వాయు కాలుష్యం అంటే ఢిల్లీ, ముంబయి నగరాల పేర్లు మాత్రమే వినిపించేవి. కానీ ఇప్పుడు హైదరాబాద్ కూడా ఈ జాబితాలో చేరిపోయింది. ఎవరు ఊహించని విధంగా వాయు (గాలి) నాణ్యత పడిపోతోంది. మరీ ముఖ్యంగా చలికాలంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. పలు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) ప్రమాదకరంగా మారుతోంది. దీనికి ఇటీవల నమోదవుతున్న లెక్కలే నిదర్శనం.

### ఢిల్లీ బాటలో హైదరాబాద్

దేశరాజధాని అయిన ఢిల్లీలో ప్రజలు శీతాకాలంలో మాస్కులు లేకుండా బయటకు రాని దుర్భర పరిస్థితులు నెలకొన్నగా, మరికొన్ని రోజుల్లోనే హైదరాబాద్ నగరంలో కూడా ప్రజలు మాస్కులు లేకుండా బయటకు రాలేని పరిస్థితులు ఎంతో దూరంలో లేవు. ఏక్యూఐ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం ఈ ఏడాది మొదలైనప్పటి నుంచే నగరంలో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. గత 2025 జనవరి 1న 128 ఉండగా అదే 2026 జనవరి 1 న ఏకంగా 317గా నమోదవడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఒక ఏడాదిలో ఎంత మార్పు వచ్చిందో ఈ లెక్కలతోనే స్పష్టంగా అర్థం అవుతోంది. నిజానికి ఈ ఏడాది జనవరి 1 నుంచి చూస్తే ఇప్పటి వరకు గాలి నాణ్యత దారుణంగా పడిపోతోంది. తీవ్రమైన చలి గాలులు వీస్తుండడంతో కాలుష్య తీవ్రత మరింత పెరిగిపోతుందని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు. సాధారంగా ఏక్యూఐ 0-50 వరకు ఉంటే ఎలాంటి ఇబ్బంది లేదని, అదే 100 దాటితే సమస్య ఉన్నట్టే. అలాంటిది కొద్ది రోజులుగా హైదరాబాద్ నగరంలో సగటున 200 పైగానే ఉండడంతో ఈ గాలిని పీల్చుకోవడానికి ఏ మాత్రం అనువైనది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నగరంలో ఉదయం 6 గంటల సమయంలో ఏక్యూఐ దారుణంగా పడిపోతోంది. మధ్యాహ్నం 2 గంటల సమయానికి కాస్త మెరుగవుచున్నను, మళ్లీ సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు గాలి నాణ్యత పడిపోతోంది. దీనికి కారణం ఈ సమయాలలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటమని అధికారులు చెబుతున్నారు.

### ఇండస్ట్రియల్ ఏరియాల్లో గాలి కాలుష్యం

గతేడాది నుంచి చూస్తే గాలి నాణ్యత గణనీయంగానే పడిపోతు వస్తోంది. అయితే ఇక్కడ కాలుష్యం 2 రకాలు. ఒకటి వాయు కాలుష్యం అయితే మరొకటి నీటి కాలుష్యం. ఈ రెండు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు సిటీలో వేరువేరుగా ఉన్నాయి. ఉదాహరణకు బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా. ఈ ప్రాంతాన్ని సిటీలో ఎయిర్ పొల్యూషన్ హాట్‌స్పాట్‌గా పిలుస్తారు. ఈ ప్రాంతంలో సాధారణంగా 150కి పైగానే ఏక్యూఐ ఉంటోంది. అంటే పీల్చుకోడానికి ఇది అనువైన గాలి కాదు. ఇక్కడ పరిశ్రమలు ఎక్కువగా ఉండడం వల్ల కాలుష్యం ఈ స్థాయిలో నమోదవుతు కొన్ని సందర్భాల్లో 200 ఏక్యూఐ దాటుతుండడం గమనార్హం. ఇదిలా ఉండగా సనత్ నగర్ ప్రాంతంలో కూడా ఇదే స్థాయిలో గాలి కలుషితమవుతోంది ఇక్కడ కూడా పలు పరిశ్రమలు ఉండడం ఇందుకు కారణం. సనత్ నగర్‌లో సగటున ఏక్యూఐ 200 కి మించి ఉంటోంది. కొన్ని సందర్భాల్లో ఇది 230 వరకు వెళ్తోంది. పాశమైలారం, కూకట్‌పల్లి, అమీన్ పూర్, బడంగ్‌పేట్, గచ్చిబౌలి, ఉప్పల్, కోకాపేట ప్రాంతాల్లోనూ వాయు కాలుష్యం విపరీతంగా ఉంటోంది. కోఠి, ఎమ్‌జీబీఎస్, ఇసామియా బజార్‌లలోను కాలుష్యం పెరిగిపోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మూసీ కారణంగా నీటి కాలుష్యం కూడా ఎక్కువగానే ఉంటోంది.

### పర్యావరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం

ముఖ్యంగా నగరంలో పారిశ్రామిక కార్యకలాపాలు వాయు కాలుష్యానికి ప్రధాన కారణంగా మారాయి. ఫ్యాక్టరీలు, విద్యుత్ ప్లాంట్ల నుంచి వెలువడే సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి విష వాయువులు గాలిని కలుషితం చేస్తున్నాయి. హానికర వాయువులు, సూక్ష్మ ధూళి కణాలు కలవడం వల్ల గాలి కలుషితమవుతోంది. మనుషులు, జంతువులు, మొక్కలతో పాటు మొత్తం పర్యావరణ వ్యవస్థపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. అత్యధిక సంఖ్యలో వ్యక్తిగత వాహనాల వినియోగం, అడవుల నరికివేత, పరిశ్రమల నుంచి వెలువడే పొగ వాయు కాలుష్యానికి ప్రధాన కారణాలుగా మారాయి.

### భూగర్భ జలాలు కలుషితం

పాశ మైలారం, జీడిమెట్ల, బాచుపల్లి, పటాన్ చెరు, బొల్లారం, మియాపూర్ ఏరియాల్లోని ఫార్మా కంపెనీల నుంచి ఉత్పతవుచున్న పరిశ్రమల వ్యర్థాలను కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం సెంట్రల్ కెమికల్ ట్రీట్ మెంట్ ప్లాంట్లకు తరలించి శుద్ధి చేయాలి. కానీ పరిశ్రమలు వీటి కోసం ఖర్చు చేయడం ఎందుకని నేరుగా నాలాలు, చెరువులు, కుంటల్లోకి విడుదల చేస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ కలుషిత గాలి పీల్చడం వల్ల దీర్ఘకాలిక సమస్యలకు గురవుతున్నారని వైద్యుల హెచ్చరిస్తున్నారు. ఇక నిర్మాణ ప్రదేశాల నుంచి వెలువడే దుమ్ము, ధూళి కణాలు కూడా గాలి నాణ్యత తగ్గిస్తున్నాయి. ప్రతి ఏటా వేల టన్నుల ధూళి కణాలు గాల్లో కలుస్తున్నాయని, దీర్ఘకాలంగా ఈ కాలుష్యానికి గురైతే ఊపిరితిత్తుల సమస్యలు పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు. కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్, మిథనాల్ తదితరాలు పరిమితి మించి గాలిలో కలిస్తే ఊపిరితిత్తుల వ్యాధులతో పాటు, క్యాన్సర్ వచ్చే ముప్పు కూడా ఉంటుందని సమాచారం.

### శీతాకాలంలో సమస్య తీవ్రత అధికం

గాలి నాణ్యత ఎక్కడెక్కడ తక్కువగా ఉంటోంది, అలా ఉన్న ప్రాంతాల్లో ఏం చేయాలి అనే మానిటరింగ్ వ్యవస్థ సరిగ్గా లేదన్న విమర్శలున్నాయి. వేగంగా విస్తరిస్తున్న కోకాపేట్, కొంపల్లి, బాచుపల్లి, ఉప్పల్ సహా ఐటీ కారిడార్లలో ఎయిర్ క్వాలిటీని సరిగ్గా లెక్కించడం లేదన్నది మరో వాదన. పారిశ్రామిక ప్రాంతాల్లోను సరైన ట్రాకింగ్ ఉండకపోవడం మరో సమస్య. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇందుకోసం అవసరమైన మేరకు నిధులు వెచ్చించడం లేదని దీంతో కొన్ని సందర్భాల్లో సరైన లెక్కలు నమోదు చేయడం కూడా కష్టమవుతోందని సంబంధిత అధికారులు తెలిపారు. విశ్వనగరంగా ఖ్యాతి గడిస్తున్న హైదరాబాద్ మహానగరం మరో ఢిల్లీగా మారకముందే పటిష్టమైన చర్యలు చేపట్టి గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ప్రజలుగా కోరుతున్నారు

# ఇస్రో రాకెట్ ప్రయోగం విఫలం

- సమస్యను విశ్లేషిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు
- నిర్ణీత సమయానికి నింగికెగిరిన పీఎస్ఎల్వీ- సీ62
- రెండు దశల పాటు సాఫీగా సాగిన రాకెట్ ప్రయాణం



**శ్రీహరికోట** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలమైంది. తొలి రెండు దశల్లో సాఫీగా సాగిన రాకెట్.. మూడో దశలో గతి తప్పింది. ఈ రోజు ఉదయం 10.18 గంటలకు శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి పీఎస్ఎల్వీ-- సీ62 రాకెట్ నింగికెగిరింది. 18 నిమిషాల ప్రయాణం తర్వాత ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చాలి. అయితే, సాంకేతిక సమస్య వల్ల రాకెట్ తో సంబంధాలు తెగిపోయాయని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. సమస్యకు గల కారణాలను విశ్లేషిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ రంగానికి అత్యంత కీలకమైన 'ఈఓఎస్-ఎన్1' లేదా 'అన్వేష' ఉపగ్రహంతో పాటు భారత్, యూకే, థయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన మరో 14 చిన్న ఉపగ్రహాలను కూడా ఈ రాకెట్ మోసుకెళ్లింది. అత్యంత కీలకమైన 'అన్వేష' ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో నిరాశ వ్యక్తమవుతోంది. కాగా, 2025 మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ -- సీ61 రాకెట్ ప్రయోగం కూడా ఇదేవిధంగా మూడో దశలోనే విఫలమైంది. ఈ ప్రయోగంలో జరిగిన తప్పొప్పులను నిశితంగా పరిశీలించి, పొరపాట్లను సరిదిద్దుకున్నాక చేపట్టిన తాజా ప్రయోగం కూడా ఫెయిలైంది.

# మున్సిపోల్స్‌కు గులాబీ దళం సన్నద్ధం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్),** మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలను గులాబీ బాస్ కేసీఆర్ ప్రస్తావించడంతో..బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీరియస్‌గా తీసుకుంటున్నారట. మున్సిపాలిటీ ఎన్నికల్లో మెజార్టీ మున్సిపాలిటీలను కైవసం చేసుకునేలా పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తున్నారట.వచ్చే నెలలో మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయ్. పదవీకాలం ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ మధ్యే జరిగిన పంచాయితీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సర్పంచులను గెలుచుకున్నా..4 వేలకు పైగా స్థానాలను గెలిచి బలమైన పోటీ ఇచ్చామని ప్రతిపక్ష బీఆర్ఎస్ చెబుతూ వస్తోంది.అయినా పంచాయతీ ఎన్నికల ఫలితాలపై గులాబీ బాస్ కేసీఆర్ సంతృప్తి వ్యక్తం చేయలేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయ్. కాంగ్రెస్ పార్టీ కంటే ఎక్కువ సర్పంచ్ స్థానాలను గెలిచి ఉండాల్సిందని పార్టీ నేతలతో జరిగిన అంతర్గత సమావేశాల్లో కేసీఆర్ అభిప్రాయపడినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్. పంచాయితీ ఎన్నికలు కనుక పార్టీ గుర్తుపై జరిగి ఉంటే..బీఆర్ఎస్ సత్తా ఏంటో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలిసేదని కేసీఆర్ అన్నారట.గుర్తు లేకుండా జరిగిన ఎన్నికల్లోనే ప్రజలు అధికార పార్టీకి బుద్ధి చెప్పారని కేసీఆర్ ఇంటర్నల్ మీటింగ్‌లో కామెంట్ చేశారట. పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగి ఉంటే ఫలితాలు మరోలా ఉండేదని ఓ రకంగా ఛాలెంజ్ చేసిన కేసీఆర్..ఇప్పుడు పార్టీ గుర్తులతో జరుగబోతున్న మున్సిపల్ ఎన్నికలపై స్పెషల్ కాన్సన్‌ట్రేషన్ పెట్టారట.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మించి కాకపోయినా ఆ పార్టీతో సరిసమానంగానైనా స్థానాలను గెలవాలన్న పట్టుదలతో ముందుకు వెళ్తోందట బీఆర్ఎస్. కేటీఆర్ మున్సిపల్ ఎన్నికలపై సీరియస్‌గా దృష్టి పెట్టారట. అందుకే ఉమ్మడి జిల్లాల వారిగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ నేతలకు మున్సిపల్ ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తున్నారట.మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వచ్చాక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహిస్తారని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగితే సత్తా చాటేవాళ్లమన్న తమ అధినేత నమ్మకాన్ని నిలబెట్టేలా మున్సిపల్ ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలను గెలుచుకునేలా కేటీఆర్ గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేశారట.రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఆగ్రహంగా ఉన్నారని బీఆర్ఎస్ భావిస్తోందట. మరి మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ వర్సెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పోటీలో ఎవరిది పైచేయి అవుతుందో.? కారు పార్టీ ఎక్స్‌పెక్టేషన్స్‌ను రీచ్ అవుతుందో లేదో చూడాలి మరి.

# మల్కాజిగిరి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల రాజ్యం

## గాయత్రీ నగర్ రహదారిపై నిబంధనలకు తూట్లు పొడుస్తున్న భారీ నిర్మాణం

- మౌనంగా టౌన్ ప్లానింగ్ అధికారులు

భారీగా మామూళ్లు తీసుకున్నారన్న ఆరోపణలు




మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని గాయత్రీ నగర్ ప్రధాన రహదారిపై పక్కింటి నెంబర్ 42-516 నిబంధనలకు విరుద్ధంగా అక్రమ సెల్లార్ తో భారీ అక్రమ నిర్మాణం జోరుగా కొనసాగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్ఎంసి అనుమతులు లేకుండానే, సెట్బ్యాక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రజా రహదారిని ఆక్రమించే విధంగా నిర్మాణ పనులు సాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న ఈ భవనం వల్ల ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకీ తీవ్రమవుతాయని అక్రమ సెల్లార్ లో వ్యాపారాలు నిర్వహించి పార్కింగ్ రోడ్డుపైన చేయడం వల్ల పాదచారులకు నడిచే స్థలం లేకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు ఫిర్యాదులు చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది స్పందించకపోవడం వెనుక అవినీతి ముఠా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో రాజకీయ నాయకుల పేరుతో భారీగా అక్రమ నిర్మాణాలు జరగడం ఆనవాయితీగా మారింది. టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా అందికి నా కాడికి దండుకొని రాజకీయ నాయకుల పేరు చెప్పి తప్పించుకోవడం తప్ప జిహెచ్ఎంసి నియమ నిబంధనాలను ఎక్కడ అమలు చేయడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.నిర్మాణ పనులు రాత్రింబవళ్ళు కొనసాగుతుండటం, సెలవు దినాల్లో కూడా పనులు ఆగకపోవడం అధికారుల అండదండలు ఉన్నాయనే అనుమానాలకు బలం చేకూరుస్తోంది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, నిబంధనలు అమలు చేయాల్సిన ప్రజాప్రతినిధులు మౌనం వహించడం ప్రజల ఆగ్రహాన్ని రెచ్చగొడుతోంది.ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు స్పందించి, గాయత్రీ నగర్ రహదారిపై కొనసాగుతున్న ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో స్థానికులతో కలిసి జిహెచ్ఎంసి కార్యాలయం ముందు నిరసనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588